/manamnews
www.manamnews.com

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

తిరుపతి | బుధవారం • 8-3-2023 • సంపుటి:7 • సంచిక:62 • పేజీలు:8 • వెల:రూ.5

AMARAVATHI | ANANTHAPURAM | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHBUBNAGAR | WARANGAL | KHAMMAM

ఫాల్గుణమాసం, బుధవారం, తిథి: పాడ్యమి, సా.7.43 వరకు, నక్షత్రం: ఉత్తరఫల్గుని, ఉ.2.22 నుంచి రేపు ఉ.4.20 వరకు, వర్జ్యం: మ.1.18-3.00 వరకు, దుర్ముహూర్తం: లేదు, రాహుకాలం: మ.12.27-1.55 వరకు


## కంగారు పెడుతున్న జలుబు, దగ్గు, వైరల్ జ్వరాలు



హెచ్3ఎన్2 కొవిడ్ మాదిరిగా వ్యాపిస్తోంది..

ప్రజలంతా జాగ్రత్తలు తీసుకోండి

ఢిల్లీ ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ గులేరియా

న్యూఢిల్లీ, మార్చి 7: వేసవికాలంలో అడుగుపెడుతున్న సమయంలో జలుబు, దగ్గు, వైరల్ జ్వరాలు ప్రజలను కంగారు ..మిగతా 2లో

## ఉక్రెయిన్ యుద్ధాన్ని నడిపిస్తోంది అదృశ్య హస్తం కాదు.. అమెరికానే..



మాస్కో, మార్చి 7: ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమై ఏడాది దాటింది. అయినా ఆ యుద్ధం ముగిసే సూచనలు మాత్రం కనబడటం లేదు. ఈ క్రమంలోనే యుద్ధాన్ని ఓ అదృశ్య హస్తం నడిపిస్తోందని చైనా ఆరోపించింది. అయితే, అది అదృశ్య హస్తం కాదని, అమెరికా హస్తమని రష్యా తాజాగా పేర్కొంది. ఈ విషయాన్ని చైనా విదేశాంగ మంత్రి చమత్కారంగా చెప్పినట్లు ..మిగతా 2లో

# సంక్షేమంలో తగ్గేదేలే..



### మార్చి, ఏప్రిల్‌లో ప్రభుత్వ పథకాల తేదీలు ఖరారు

### కోడ్ ముగియగానే వరుస కార్యక్రమాలు

### అధికారులతో సీఎం జగన్ సమీక్ష

అమరావతి, మార్చి 7 (మనం న్యూస్): ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాల విషయంలో ఏ మాత్రం వెనక్కి తగ్గడంలేదు ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ, పథకాల అమలుకు బ్రేక్ పడింది. కానీ, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే వరుసగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలు తేదీలు ఖరారు చేశారు. సీఎంవో అధికారులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మంగళవారం సమావేశమయ్యారు.. అసెంబ్లీ సమావేశాలు, మార్చి, ఏప్రిల్ నెలల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, అమలు చేయాల్సిన పథకాల తేదీలను ఫైనల్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా పలు కార్యక్రమాలు నిలిచిపోయాయి.. ఎన్నికల కోడ్ ముగియనుండడంతో ఈ కార్యక్రమాలు, పథకాల అమలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.. అయితే, ఎన్నికల కోడ్‌తో సంబంధం లేని కారణంగా ..మిగతా 2లో

## మహిళల అభ్యున్నతే ప్రగతికి కొలమానం



2

## మోదీ సమక్షంలో ఇద్దరు సీఎంల ప్రమాణస్వీకారం



మేఘాలయ సీఎంగా రెండోసారి సంగ్మా

నాగాలాండ్ సీఎంగా నెఫ్యూ రియో రికార్డ్..

నాగా చరిత్రలో తొలి మహిళా మంత్రి

షిల్లాంగ్, మార్చి 7: ఈశాన్య రాష్ట్రాలైన మేఘాలయ, నాగాలాండ్‌ల ముఖ్యమంత్రులు మంగళవారం నాడు ప్రధాని మోదీ సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. మేఘాలయ సీఎంగా సంగ్మా, నాగాలాండ్ సీఎంగా నెఫ్యూ రియో రికార్డు సృష్టించారు. మేఘాలయలో నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్పీపీ) అధినేత కాన్రాడ్ కె.సంగ్మా వరుసగా రెండోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణం ..మిగతా 2లో

## అన్ని రంగాల్లోనూ నారీశక్తి..



### ఎయిర్‌ఫోర్స్ కెప్టెన్‌గా షాలిజా ధామి

### వాయుసేన చరిత్రలో తొలిసారి..

న్యూఢిల్లీ: సైన్యంలో మహిళలు రాణించడమంటే సామాన్యమైన విషయం కాదు. కానీ ఇప్పుడు అది చిన్న విషయంగా మారిపోతోంది. ఎందుకంటే మహిళలు ఇప్పుడు త్రివిధ దళాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. గతంలో వివిధ భారత సైనిక దళాలలో పురుషులు మాత్రమే ముందుండే మహిళలు త్రివిధదళాలలో ఉన్నప్పటికీ ప్రత్యక్ష యుద్ధరంగంలో క్రియాశీలక పాత్రలో ఉండేవారు కాదు. ఇప్పుడు త్రివిధ దళాల్లో తమ శక్తి యుక్తులను నిరూపించుకుంటూ పురుషులకు దీటుగా సత్తా చాటుతున్నారు. షాలిజా ధామి చరిత్ర సృష్టించనుంది. ఎయిర్ ఫోర్స్ ఫ్రంట్ లైన్ కంబాట్ ..మిగతా 2లో

## నా తండ్రికి ఏదైనా జరిగితే.. ఎవర్నీ వదలను..!



లాలూ కుమార్తె రోహిణీ ఆచార్య

పాట్నా, మార్చి 7: రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ఉద్యోగాలు ఇప్పించేందుకు కొంతమంది అభ్యర్థుల నుంచి భూములు తీసుకున్నారన్న అభియోగాలపై నమోదైన కేసులో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ సీబీఐ విచారణను ఎదుర్కొంటున్నారు. మంగళవారం దర్యాప్తు సంస్థ ఆయన్ను ప్రశ్నించింది. దీనిపై లాలూ కుమార్తె రోహిణీ ఆచార్య ట్విటర్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తండ్రిని నిరంతరం వేధిస్తున్నారని, ఆయనకు ఏదైనా జరిగితే ఎవర్నీ వదలనని హెచ్చరించారు. ఈ మేరకు వరుస ట్వీట్లు ..మిగతా 2లో

## పెండింగ్ బకాయిలు చెల్లిస్తాం



ఉద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పిన ప్రభుత్వం

ఉద్యోగులు ప్రభుత్వంలో భాగం

అందరం కలిసి పనిచేస్తే లక్ష్యాలు సాధిస్తాం

ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

ఉద్యోగ సంఘాలతో ముగిసిన చర్చలు

అమరావతి, మార్చి 7 (మనం న్యూస్): ఉద్యోగులకు తీపికబురు చెప్పింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. మార్చి నెలాఖరులోగా పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు అంగీకారం తెలిపింది. ఈ నెలాఖరులోగా సుమారు రూ.3 వేల కోట్ల మేర పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని స్పష్టం చేసింది ప్రభుత్వం. ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు ముగిశాయి. అనంతరం మీడియాతో మాట్లాడిన ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి.. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగం.. అందరూ కలిస్తేనే.. ప్రభుత్వ లక్ష్యాలను సాధించడం సాధ్యం అనే స్ఫూర్తితోనే ఉన్నాం అన్నారు. కోవిడ్ వల్ల ఆర్థిక ఇబ్బందులు వచ్చాయి.. ఆ ప్రభావం ఏపీ మీద కూడా పడింది.. ఆ క్రమంలోనే ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై కొంత జాప్యం జరిగిన ..మిగతా 2లో

## మహిళా సాధికారతకు పెద్దపీట



మహిళల జీవితాల్లో వెలుగులు నింపడమే సీఎం జగన్ లక్ష్యం

సమాన అవకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వం మాదే

వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని

ఏపీలో ప్రతిరోజూ మహిళా దినోత్సవమే

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ

అమరావతి, మార్చి 7 (మనం న్యూస్): రాష్ట్రంలో మహిళా సాధికారత, సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని, సీఎం వల్లే ఇది సాధ్యమవుతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజని ..మిగతా 2లో

## మా క్షిపణులను కూలిస్తే ఊరుకోం..



అదే జరిగితే మాపై యుద్ధం ప్రకటించినట్లే

ఉత్తర కొరియా ప్రకటన

ప్యాంగ్యాంగ్: ఉత్తరకొరియా మరోసారి అమెరికాకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. తాము పరీక్షించే క్షిపణులను కూల్చివేస్తే సహించేది లేదని తేల్చిచెప్పింది. దానిని తమపై యుద్ధంగా భావిస్తామని పేర్కొంది. అమెరికా-దక్షిణ కొరియా సంయుక్త యుద్ధవిన్యాసాలను ప్యాంగ్యాంగ్ తప్పుబట్టింది. ఈ మేరకు ఉత్తరకొరియా అధినేత కిమ్జోంగ్ ఉన్ సోదరి, దేశంలోనే అత్యంత శక్తిమంతమైన మహిళ కిమ్ యో జోంగ్ ఈ మేరకు హెచ్చరికలు ..మిగతా 2లో

## స్మార్ట్ మీటర్లపై తప్పుడు ప్రచారం చేయొద్దు





రైతులకు మేలే తప్ప నష్టం లేదు

విద్యుత్ శాఖ స్పెషల్ సీఎస్ విజయానంద్

అమరావతి, మార్చి 7 (మనం న్యూస్): స్మార్ట్ మీటర్లపై తప్పుడు ప్రచారం చేయొద్దు.. స్మార్ట్ మీటర్ల ద్వారా రైతులకు మేలు జరుగుతుంది తప్ప నష్టం జరగదని స్పష్టం చేశారు ..మిగతా 2లో

## త్వరలో 1,500 డీజిల్, వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులు



ఆర్టీసీ చరిత్రలో ఇదే తొలిసారి

ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

అమరావతి, మార్చి 7 (మనం న్యూస్): త్వరలో సుమారు 1500 డీజిల్ బస్సులు, 1000 ఎలక్ట్రిక్ బస్సులు కొత్తవి కొనుగోలు చేస్తున్నాం.. ఏపీఎస్ఆర్టీసీ చరిత్రలో ఇన్ని బస్సులు కొనుగోలు చేయడం ఇదే తొలిసారి అన్నారు ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకా ..మిగతా 2లో

## దేశ నిర్మాణంలో మహిళల పాత్ర గొప్పది



మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్ అబ్దుల్ నజీర్ 2

## ఎస్ఆర్ఎంలో మహిళా వికాస వారోత్సవాలు ప్రారంభం



2

## వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ని డంపింగ్ యార్డ్‌గా మార్చేస్తారా?



మోదీ, జగన్‌లది నియంత పాలన

రాష్ట్రం సర్వనాశనమవుతోంది

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

అమరావతి, మార్చి 7 (మనం న్యూస్): మోదీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు సీపీఐ నేత నారాయణ. విశాఖపట్నం సీల్ట్ ప్లాంట్‌ను బీజేపీ డంపింగ్ యార్డ్‌గా మార్చబోతోందని ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మోది హటావో దేశ్ బచావో నినాదంతో త్వరలో సిపిఐ అధ్వర్యంలో పాదయాత్ర చేపడుతున్నాం అని ఆయన తెలిపారు. జనం మద్దతు ఉంటే ఎందుకు పోలీసుల వలయంలో తిరుగుతున్నావ్ జగన్ అని ఆయన ప్రశ్నించారు. ఎందుకు అంత భయం జగన్‌కి. కుటుంబ సభ్యులతో కూడా ..మిగతా 2లో

## ప్రతీ ఒక్కరూ ఆడ పిల్లలను గౌరవించాలి



దిశ యాప్తో మహిళలకు భద్రత, భరోసా వచ్చింది

పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా

ఏఎన్యూలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2

### మంచిమాట

నీ అంగీకారం లేకుండా నీ ఆత్మగౌరవాన్ని ఎవ్వరూ తగ్గించలేరు.

శుభోదయం

## ఉక్రెయిన్ యుద్ధాన్ని నడిపిస్తోంది అదృశ్య హస్తం కాదు.. అమెరికానే..

(మొదటిపేజీ తరువాయి)

క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కొవ్ వెల్లడించారు. ఈ యుద్ధం ముగియాలని అమెరికా కోరుకోవడం లేదని.. ఈ యుద్ధాన్ని కొనసాగించాలని కోరుకుంటోందని.. ప్రతీదీ చేస్తోందని, ఇది కనిపించే హస్తమేనని ఆయన పేర్కొన్నారు. అమెరికా, దాని మిత్రదేశాలు ఉక్రెయిన్‌ను యుద్ధం చేయడానికి పావుగా ఉపయోగించుకుంటున్నాయని మాస్కో పదేపదే ప్రకటించింది. ఈ కథనాన్ని ఉక్రెయిన్‌తో పాటు పశ్చిమ దేశాలు వాటిని కొట్టిపారేశాయి. రష్యా ఆక్రమణలకు వ్యతిరేకంగా కీవ్ పోరాడుతోందని వెల్లడించాయి. చైనా కాల్పుల విరమణ చొరవను ప్రస్తావిస్తూ.. పెస్కోవ్ మాట్లాడుతూ, మాస్కో బీజింగ్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, అటువంటి శక్తివంతమైన దేశానికి ప్రపంచ సమస్యలపై గొంతు వినిపించడం సహజమని అన్నారు. చైనా విదేశాంగ మంత్రి కిన్ గ్యాంగ్ ఇటీవల మాట్లాడుతూ.. ఈ వివాదం మరింత కాలం కొనసాగేలా, అది తీవ్రంగా మారేలా ఒక అదృశ్య హస్తం నడిపిస్తున్నట్లు కనిపిస్తోందన్నారు.

## కంగారు పెడుతున్న జలుబు, దగ్గు, వైరల్ జ్వరాలు

(మొదటిపేజీ తరువాయి)

పెడుతున్నాయి. కొవిడ్ తరహా లక్షణాలున్న ఈ ఇన్‌ఫ్లుయెంజా కేసులు గత కొంతకాలంగా పెరుగుతున్నాయి. ఈ ఇన్‌ఫ్లుయెంజా కేసులకు హెచ్3ఎన్2 వైరస్ రకం కారణం. ప్రస్తుతం ఈ కేసుల పెరుగుదలపై దిల్లీ ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియా స్పందించారు. ఈ ఫ్లూ తుంపర్ల రూపంలో కొవిడ్ మాదిరిగా వ్యాపిస్తుందని, ప్రతి ఏడాది ఈ సమయంలో వైరస్‌లో ఉత్పరివర్తనలు చోటుచేసుకుంటాయని వెల్లడించారు. ప్రస్తుతం పండగల సీజన్ కావడంతో ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మరీ ముఖ్యంగా వృద్ధులు, ఇతర అనారోగ్యాలతో బాధపడేవారు మరింత జాగ్రత్త వహించాలన్నారు.

**పెరుగుతున్న ఫ్లూ కేసులు.. ఈ పనులు చేయొద్దు..!**

'హెచ్1ఎన్1 వైరస్ వల్ల గతంలో ఒక మహమ్మారిని చవిచూశాం. ఇప్పుడు దానికి సంబంధించిన సాధారణ వేరియంటే హెచ్3ఎన్2. దానిలో స్వల్పస్థాయిలో ఉత్పరివర్తనలు చోటుచేసుకోవడంతో ప్రస్తుతం ఎక్కువ కేసులు కనిపిస్తున్నాయి. రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవారు సులభంగా దీని ప్రభావానికి గురవుతున్నారు' అని వెల్లడించారు. అయితే ఆసుపత్రిలో చేరికలు భారీ స్థాయిలో లేకపోవడంతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కేసులు పెరగడానికి గల రెండు కారణాలు వెల్లడించారు. ఈ సమయంలో వాతావరణంలో వచ్చే మార్పులు, అలాగే కొవిడ్ కేసులు తగ్గుముఖం పట్టినప్పటి నుంచి రద్దీ ప్రదేశాల్లో ప్రజలు మాస్కులు ధరించకపోవడం ఇందుకు కారణమన్నారు.

**ఫ్లూ లక్షణాలివే..**

గత రెండు మూడు నెలలుగా ఈ ఫ్లూ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇతర సబ్ టైప్‌లతో పోల్చితే ఈ 'హెచ్3ఎన్2' రకం ఎక్కువగా ప్రభావం చూపుతోంది. దీని ప్రధాన లక్షణాలు.. ఎడతెరపి లేని దగ్గు, జ్వరం. దీంతో పాటు శ్వాస పీల్చుకోవడంలో సమస్యలు, వికారం, వాంతులు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు, విరేచనాలు.

## మోదీ సమక్షంలో ఇద్దరు సీఎంల ప్రమాణస్వీకారం

(మొదటిపేజీ తరువాయి)



చేశారు. రాజ్‌భవన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఫాగు చౌహాన్.. సంగ్మా చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు, కేంద్ర హోంమం త్రి అమిత్ షా, భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తదితరులు హాజరయ్యారు. సంగ్మాతో పాటు మరో 11 మంది ఎమ్మెల్యేలు కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు. వీరిలో ఎన్పీపీ పార్టీకి చెందిన ఏడుగురు, యూడీపీ నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ఒకరు, హెచ్ఎస్పీడీపీ నుంచి ఒక ఎమ్మెల్యే ఉన్నారు. ఇటీవల జరిగిన మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్పీపీ 26 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవత రించిన విషయం తెలిసిందే. అయితే 60 స్థానాలున్న మేఘాలయ అసెంబ్లీ లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన మెజార్టీ లభించలేదు. దీంతో బీజేపీ, యూడీపీ వంటి మిత్రపక్షాలతో కలిసి కాన్రాడ్ సంగ్మా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.

**నాగా చరిత్రలో తొలి మహిళా మంత్రి**

ఈశాన్య రాష్ట్రం నాగాలాండ్ ముఖ్యమంత్రిగా ఎన్డీపీపీ నేత నెఫ్యూ రియో వరుసగా ఐదోసారి ప్రమాణస్వీకారం చేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ లా గణేశన్ ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తదితరులు హాజరయ్యారు. రియోతో పాటు పలువురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేశారు. సోషల్ మీడియా ద్వారా ప్రధాని మోదీ సహా ఎంతో మంది అభిమానుల ను సంపాదించుకున్న నాగాలాండ్ బీజేపీ అధ్యక్షుడు తెమ్జెన్ ఇమ్నా అలోంగ్‌కు కేబినెట్‌లో మరోసారి చోటు దక్కింది.

**'తొలి' మహిళకు.. మంత్రి బాధ్యతలు**

ఇక.. ఈ ఎన్నికలు నాగాలాండ్‌లో సరికొత్త చరిత్రను లిఖించిన విషయం తెలిసిందే. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఇద్దరు మహిళలు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. అందులో ఒకరైన సల్హౌతునో క్రుసెను మంత్రి వర్గంలోకి తీసుకోవడం విశేషం. ఎన్డీపీపీ పార్టీ తరపున విజయం సాధించిన ఆమె.. నేడు కేబినెట్ మంత్రిగా ప్రమాణం చేశారు.

## నా తండ్రికి ఏదైనా జరిగితే.. ఎవర్నీ వదలను..!

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. 'తన తండ్రిని వేధిస్తోన్న తీరు సరికాదు. ఇవన్నీ గుర్తుంటాయి. సమయం అన్నింటికంటే శక్తివంతమైంది. ఆయనకు ఢిల్లీలోని పీఠాన్ని కదిలించే శక్తి ఇప్పటికీ ఉంది' అని అన్నారు. అలాగే సహనానికి కూడా హద్దు ఉంటుందని, దాన్ని కూడా పరీక్షిస్తున్నారంటూ మండి పడ్డారు. 2004 నుంచి 2009 వరకు కేంద్రంలో యూపీఏ హయాంలో లాలూ రైల్వే మంత్రిగా ఉన్నారు. ఈ క్రమంలోనే 2008-09 మధ్య రైల్వే ఉద్యోగాలకు నియామక ప్రక్రియ జరగ్గా.. కొందరు అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు వారి నుంచి లాలూ కుటుంబం భూములు, ఇతర ఆస్తులను లంచంగా తీసుకున్నట్లు వచ్చిన ఆరోపణలపై గతంలో సీబీఐ కేసు నమోదుచేసింది. దానిపై లాలూ, ఆయన సతీమణి రబ్రీదేవిని రెండు రోజులు సీబీఐ విచారించింది. ఇదిలా ఉంటే.. సింగపూర్‌లో విజయవంతంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స అనంతరం లాలూ ప్రసాద్ ఇటీవలే స్వదేశానికి తిరిగొచ్చారు. రోహిణినే ఆయనకు కిడ్నీ దానం చేశారు.

# మహిళా సాధికారతకు పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'మహిళా సాధికారత, సమానత్వం' అంశంపై పలువురు మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజని మాట్లాడుతూ మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వం తమదేనని పేర్కొన్నారు. ప్రతి అడుగులోనూ సీఎం మహిళలకు అండగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో మహిళకు ప్రాధాన్యత పెరగడానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఒక కారణమన్నారు. నవరత్నాల ద్వారా అమలు చేస్తున్న ప్రతి పథకం మహిళల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిందేనన్నారు. మహిళలకు అన్ని స్థాయిల్లో మేలు చేస్తున్నాం కాబట్టే తమ రాష్ట్రంలో మహిళలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. మాటకు, చేతకు మన్నన ఇచ్చే మనసున్న వ్యక్తి సీఎంఅని కొనియాడారు. మహిళలు సొంతంగా తమ కాళ్ల మీద తామే నిలబడి ఎదగాలని మహిళల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రధానంగా అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, కాపునేస్తం వంటి పథకాల ద్వారా సాధికారతతో పాటు తోడ్పాటు అందిస్తున్నామన్నారు. విద్యతోనే కుటుంబ తలరాతలు మారుతాయని బలంగా విశ్వసించిన ముఖ్యమంత్రి.. జగనన్న అమ్మఒడి ద్వారా ఏటా రూ.15,000ల ఆర్థిక సాయం, జగనన్న గోరుముద్ద ద్వారా నాణ్యమైన, మెరుగైన, రుచికరమైన పౌష్టికాహారం, 9 రకాల వస్తువులతో కూడిన జగనన్న విద్యాకానుక కిట్, జగనన్న విద్యాదీవెన ద్వారా పూర్తి ఫీజు రీయింబర్స్ మెంట్, భోజన, వసతి ఖర్చుల కోసం జగనన్న వసతి దీవెన వంటి పథకాలు విద్యారంగంలో అమలు చేస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్ కు బాటలు వేస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా 3255 చికిత్సలకు ఉచితంగా వైద్యం అందించడమే గాకుండా చికిత్స అనంతరం రోగి కోలుకునే సమయంలో ఆర్థికంగా ఇబ్బంది ఎదురుకాకూడదన్న ఉద్దేశంతో ఆరోగ్య ఆసరా ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. గర్భవతిగా ఉన్నప్పుడే మహిళలకు, పుట్టిన అనంతరం చిన్నారులకు సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ ప్లస్ ద్వారా సంపూర్ణ పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. గర్భిణీ స్త్రీలు క్షేమంగా చికిత్స అనంతరం ఇంటికి చేర్చేలా తల్లిబిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, వైద్యం, భవిష్యత్‌లో ఉద్యోగాల కల్పన వంటి అన్ని అంశాల గురించి ఆలోచిస్తోన్న ప్రభుత్వం తమదన్నారు. దిశ యాప్ ద్వారా మహిళల భద్రతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. కేబినెట్లో మహిళలకు మంత్రులుగా అవకాశమివ్వడమే కాకుండా నామినేటెడ్ పనులు, నామినేటెడ్ పదవుల్లోనూ 50శాతం రిజర్వేషన్ అవకాశం కల్పించారన్నారు. కడుపులో ఉన్న బిడ్డ మొదలుకొని చివరి దశ వరకు అన్ని స్థాయిల్లో ప్రభుత్వం సేవలందిస్తోందన్నారు. తమది మహిళా పక్షపాత ప్రభుత్వమని, తమ ముఖ్యమంత్రి మహిళా పక్షపాత సీఎం అని తెలిపారు. రాష్ట్రంలో మహిళలకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అనేక అవకాశాలు కల్పిస్తున్న మంచి మనసున్న సీఎం.. వైఎస్ జగన్ అని కొనియాడారు. త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రారంభం కాబోతుందని తద్వారా ప్రభుత్వ వైద్యులే ఇంటికి వచ్చి వైద్యం అందించే వ్యవస్థను తీసుకురాబోతున్నామన్నారు.

**ఏపీలో ప్రతి రోజూ మహిళా దినోత్సవమే: వాసిరెడ్డి పద్మ**

ఏపీ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని మహిళాంధ్రప్రదేశ్ గా మార్చారని అన్నారు. మహిళల కోసం సమస్త యంత్రాంగం, వ్యవస్థ పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో మహిళను నిర్ణయాత్మక శక్తిగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రిదన్నారు. అడగకుండానే అన్నింట్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. మహిళా సంక్షేమం కోసం ఎంతైనా చేయాలన్న తపన ముఖ్యమంత్రికి ఉందన్నారు. ప్రతి మహిళ జీవితంలో మార్పు రావాలన్నదే ఆయన లక్ష్యమన్నారు.

## త్వరలో 1,500 డీజిల్, వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులు

(మొదటిపేజీ తరువాయి)

తిరుమల రావు.. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఈ రోజు ఓ పత్రికలో వచ్చిన వార్త పూర్తి అవాస్తవం.. నిరాధారం అన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ బస్సులు 140 కోట్ల కిలోమీటర్లు తిరుగుతాయి 27 కోట్ల లీటర్ల డిజిల్ ప్రొక్యూర్ చేస్తాం.. భారత్, ఇండియన్, హిందూస్తాన్ వంటి కంపెనీల నుండి డైరెక్ట్‌గా టెండర్ల ద్వారా ప్రొక్యూర్ చేస్తామని తెలిపారు. అన్ని కోట్ల లీటర్ల డిజిల్ ప్రొక్యూర్ చేస్తాం కాబట్టి ఏ కంపెనీ ఎక్కువ డిస్కౌంట్ ఇస్తే ఆ కంపెనీకి ప్రయారిటీ ఇస్తాం.. 2022 మార్చి నుండి 2025 ఫిబ్రవరి వరకు టెండర్ 5.87 పైసలు లీటరు డిస్కౌంట్ ఇవ్వడంతో 157 కోట్లు ఆదా వస్తుంది.. అందుకే ఆ టెండర్ ఖరారు చేశామని స్పష్టం చేశారు.. బల్క్ రేట్లు పెరగడంతో లోకల్ గానే డీజిల్ ప్రొక్యూర్ చేసేందుకు నిర్ణయం తీసుకున్నాం.. 2022 ఫిబ్రవరిన ప్రతి జిల్లాలో ఆర్ఎం ఓ కమిటీ ఏర్పాటు చేసి లోకల్‌గా రిటైల్ ద్వారా డీజిల్ కొనుగోలు చేశామని తెలిపారు. మార్చి 1 వ తేదిన బల్క్ రేట్లు తగ్గాయి.. మరలా బల్క్ రేట్ల ద్వారా డీజిల్ కొనుగోలుకు వెళ్లామని తెలిపారు ద్వారకా తిరుమలరావు.. త్వరలో సుమారు 1500 డీజిల్ బస్సులు 1000 ఎలక్ట్రిక్ బస్సులు కొత్తవి కొనుగోలు చేస్తున్నామని తెలిపిన ఆయన.. ఏపీఎస్ ఆర్టీసీ చరిత్రలో ఇన్ని బస్సులు కొనుగోలు చేయడం ఇదే తొలిసారి అని ప్రకటించారు.. కర్ణాటకలో కొత్తగా తీసుకువచ్చిన 15 మీటర్ల బస్సులను తీసుకొస్తాం.. 2,736 మొత్తం బస్సులు త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. ఇక, 15 ఏళ్లు పూర్తి అయిన 221 బస్సులు గుర్తించాం.. కొత్త బస్సులు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి నాలుగు నెలల్లో ప్రారంభిస్తామని పేర్కొన్నారు.. కొత్త బస్సులకు రూ.572 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసినట్టు తెలిపారు ఏపీఎస్‌ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు.

## దేశ నిర్మాణంలో మహిళల పాత్ర గొప్పది

అమరావతి, మార్చి 7 (మనం న్యూస్): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ శుభాకాంక్షలు తెలిపారు. దేశ నిర్మాణంలో మహిళల పాత్ర చాలా గొప్పది. అనేక రంగాల్లో మహిళలు తిరుగులేని నాయకత్వాన్ని పోషిస్తున్నారు. మహిళలు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు అని గవర్నర్ అన్నారు. విజయవాడలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు విజయవాడలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణించిన మహిళలను సన్మానించారు. సంక్షేమ పథకాలతో ప్రతిరోజూ మహిళా దినోత్సవమేనని, మహిళల కోసం సీఎం జగన్ ఒక యజ్ఞం చేస్తున్నారని ఏపీ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. ఏపీలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. మహిళల రక్షణ కోసం విప్లవాత్మక మార్పులు తెచ్చారని వాసిరెడ్డి పద్మ అన్నారు.

## ప్రతీ ఒక్కరూ ఆడ పిల్లలను గౌరవించాలి

అమరావతి, మార్చి 7 (మనం న్యూస్): దిశా యాప్‌తో మహిళలకు భద్రత, భరోసా వచ్చిందని మంత్రి ఆర్కే రోజా అన్నారు. ప్రతీ మహిళ దిశా యాప్‌ను వినియోగించుకోవాలన్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఘటనను చూసి ఏపీలో దిశ చట్టం చేసిన వ్యక్తి సీఎం జగన్ అని ఆమె అన్నారు. ప్రతీ ఒక్కరూ ఆడ పిల్లలను గౌరవించాలన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ విశిష్ట పురస్కారం అందుకోవడం తన అదృష్టమని, ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని మంత్రి రోజా అన్నారు. ''నేను ఎంచుకున్న రెండు రంగాలు సవాళ్లతో కూడుకున్నవి. పురుషాధిక్యత ఉన్న ఈ రంగాల్లో రాణించేందుకు నా తండ్రి, సోదరులు, భర్త అండగా నిలిచారు. నాకు తోడబుట్టకపోయినా నేనున్నానని భరోసా కల్పించిన అన్న సీఎం జగన్. కష్టాన్ని నమ్ముకున్నోళ్లకు సక్సెస్ వచ్చి తీరుతుంది. చాలా మంది ఇళ్లల్లో ఆడ పిల్లంటే చిన్నచూపు ఉంటుంది. మగ పిల్లాడిని ఒకలా.. ఆడ పిల్లను మరోలా చూస్తారు. ఇల్లు, బడి, ఉద్యోగం అన్ని చోట్లా మహిళలను గౌరవించాలి'' అని మంత్రి రోజా పిలుపునిచ్చారు.

## ఎస్ఆర్ఎంలో మహిళా వికాస వారోత్సవాలు ప్రారంభం

### మహిళలకు ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



అమరావతి, మార్చి 7, మనం న్యూస్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో మంగళవారం మహిళా వికాస వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ గ్రామీణ మహిళలకు ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ప్రారంభించారు. మంగళగిరి ఎయిమ్స్, ఐజీకార్ (కల్పాకం) సహకారంతో ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వీటిని నిర్వహిస్తోంది. విజయవాడ ఆడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ పల్లా వెంకట రత్నం, ఐజీకార్ రామ్స్ హెడ్ డాక్టర్ మేనకలు ముఖ్య అతిథులుగా విచ్చేసి మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ పీవీ రత్నం మహిళల రక్షణ, యాంటీ ర్యాగింగ్, మహిళల హక్కులు గురించి ప్రసంగించారు. విద్యార్థినులు సోషల్ మీడియా ప్రయోజనాలను సరైన విధంగా అందిపుచ్చుకోవాలని సూచించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్, మహిళా దినోత్సవాల నిర్వహణ కమిటీ కో కన్వీనర్ డాక్టర్ సునీత తదితరులు అతిథులను ఆహ్వానించి వివిధ గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాల గురించి వివరించారు. ఈ సందర్భంగా అతిథులు వీవీరత్నం. మేనకలను మహిళా దినోత్సవ నిర్వహణ కమిటీ ఘనంగా సత్కరించింది. శాలువా కప్పి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీరాజ్యం, కో కన్వీనర్. డాక్టర్ కేపీ సునీత, డైరెక్టర్లు అనిల్ నిగమ్, అనూప్ సూర్యవంశీ, సీఎఫ్ వో సుమ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్లపై తప్పడు ప్రచారం చేయొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ స్పెషల్ సీఎస్ విజయానంద్. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆయన.. వ్యవసాయదారుల కోసమే స్మార్ట్ మీటర్లను ప్రభుత్వం పెడుతోంది.. మార్చి నుంచి సెప్టెంబర్ లోపు టెండర్లు ఫైనల్ అవుతాయన్నారు.. రాష్ట్రంలో 18.5 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి.. ఎంత విద్యుత్ వినియోగం, ప్రభుత్వం ఎంత సబ్సిడీ ఇస్తోంది.. రైతుకు తెలియజేయటం కోసమే ఈ మీటర్లు ఏర్పాటు చేస్తున్నాం అన్నారు. నాణ్యమైన విద్యుత్ డిస్కంల నుంచి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని.. ఫ్రీఖ మీటర్ల ద్వారా, ఫీడర్ కు మీటర్ పెట్టడం ద్వారా రైతుకు ఎంత విద్యుత్ వినియోగం జరుగుతోంది అనేది స్పష్టంగా చెప్పలేమని తెలిపారు. అయితే, ప్రతి కనెక్షన్‌కు మీటర్ ద్వారా మాత్రమే రైతుకు విద్యుత్ వినియోగం, ప్రభుత్వ సబ్సిడీ గురించి స్పష్టంగా తెలుస్తుందన్నారు విజయానంద్.. టెక్నాలజీ ద్వారా సంస్కరణల్లో భాగంగా మాత్రమే మీటర్లు పెడుతున్నాం.. స్మార్ట్ మీటర్ల ద్వారా రైతులకు మేలు జరుగుతుంది తప్ప నష్టం జరగదని వ్యాఖ్యానించారు.. రైతులు కూడా మీటర్ల ఏర్పాటుకు సుముఖంగా ఉన్నారని తెలిపారు.. 4 వేల కోట్లు ఖర్చు చేయటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి 1600 కోట్లు గ్రాంటును కూడా ఇచ్చే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై అపోహలు కలిగించ వద్దు అని విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం పైలెట్ ప్రాజెక్ట్ లో 83.16 శాతం మీటర్లు పని చేస్తున్నాయి.. పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతం అయ్యింది.. కావున.. రాష్ట్రవ్యాప్తంగా క్రమంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ ఉంటుందని తెలిపారు విద్యుత్ శాఖ స్పెషల్ సీఎస్ విజయానంద్.

# విదేశీ పెట్టుబడులు ఒక్కపైసా రాలేదు..

### బటన్లు నొక్కినట్లు.. ఉత్తుత్తి కార్యక్రమాలు చేయడమేంటి
### బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్



సత్యసాయి జిల్లా, మార్చి 7 (మనం న్యూస్): విశాఖపట్నం వేదికగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్(జీఐఎస్) నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు రాబట్టింది. ఈ మేరకు ఆయా సంస్థలతో ఎంవోయూలు కూడా కుదుర్చుకుంది. అయితే, జీఐఎస్‌పై విపక్షాల నుంచి విమర్శలు తప్పడం లేదు.. ఈ వ్యవహారంపై స్పందించిన బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్.. శ్రీ సత్యసాయి జిల్లాలో మీడియాతో మాట్లాడుతూ.. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ఒక్క పైసా కూడా విదేశీ పెట్టుబడి రాలేదని ఆరోపించారు.. బటన్లు నొక్కినట్లు ఉత్తుత్తి కార్యక్రమాలు చేయడమేంటి..! అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.. ఇక, ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ టక్కుటమారా విద్యలు ప్రదర్శిస్తోందని మండిపడ్డారు.. ఉపాధ్యాయ, పట్టబద్రుల ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలో విద్యా అర్హతలు లేని వారిని, టీచర్ ట్రైనింగ్ కానీ వారిని దొంగ ఓట్ల జాబితాలో చేర్చారని విమర్శలు గుప్పించారు బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్.. కాగా, గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతంగా నిర్వహించడంతో సంబంధిత శాఖల మంత్రులు, పరిశ్రమల శాఖ అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అభినందించారు. విశాఖపట్నంలో మార్చి 3, 4 తేదీల్లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్లో రెండు రోజుల్లో రూ. 13.41 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా, 378 ఒప్పందాలు జరిగాయి. 6.09 లక్షల మందికి ఉపాధి లభించనుందని ప్రభుత్వం చెబుతోంది.. ఎంవోయూలు అమలు దిశగా ఇప్పటికే చర్యలు ప్రారంభించిన ఏపీ సర్కార్.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన కమిటీని ముఖ్యమంత్రి ఏర్పాటు చేశారు. కమిటీ ప్రతి వారం సమావేశమై సదస్సులో కుదిరిన ఎంవోయూల అమలు దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రులు, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు సీఎం వైఎస్ జగన్.

## మా క్షిపణులను కూలిస్తే ఊరుకోం..

(మొదటిపేజీ తరువాయి)

జారీ చేసినట్లు కేసీఎన్ఏ వార్తా సంస్థ వెల్లడించింది. ప్యాంగ్యాంగ్ వ్యూహాత్మక పరీక్షలకు వ్యతిరేకంగా అమెరికా సైన్యం చేపట్టే చర్యలను యుద్ధ ప్రకటనగా భావిస్తామని పేర్కొంది. తాము అవసరమైతే పసిఫిక్ మహాసముద్రంలోకి మరిన్ని క్షిపణులను ప్రయోగించగలమని కిమ్ యో జోంగ్ హెచ్చరించారు. మరోవైపు ఉత్తరకొరియా విదేశాంగ శాఖ మీడియా విభాగం కూడా అమెరికాపై ఆరోపణలు చేస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. బి-52 బాంబర్లతో అమెరికా నిర్వహించే యుద్ధ విన్యాసాలు పరిస్థితిని మరింత ఎగదోస్తున్నాయని పేర్కొంది. అమెరికా-దక్షిణ కొరియా దేశాలు క్షేత్రస్థాయిలో కూడా యుద్ధ విన్యాసాలకు ప్రయత్నాలు చేస్తోందన్నారు. పసిఫిక్ సముద్రం జపాన్ లేదా అమెరికా సొత్తుకాదని ఉత్తరకొరియా పేర్కొంది.

## అన్ని రంగాల్లోనూ నారీశక్తి..

(మొదటిపేజీ తరువాయి)

యూనిట్‌కి మహిళా అధికారిగా రానున్నారు. భారత వైమానిక దళం పాశ్చాత్య సెక్టార్లోని ఫ్రంట్ లైన్ కంబాట్ యూనిట్కు నాయకత్వం వహించనున్నారు. ఈ మేరకు గ్రూప్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు షాలిజా ధామి. ఈ సందర్భంగా షాలిజా ధామి ఎంపిక మహిళా లోకానికి స్ఫూర్తిదాయకం కానుంది. ఐఏఎఫ్ చరిత్రలో మొట్ట మొదటిసారిగా ఒక మహిళా అధికారికి ఫ్రంట్ లైన్ కంబాట్ యూనిట్‌కు ఎంపిక చేయడం విశేషం. ఆమె అసాధారణమైన ప్రతిభకు, పట్టుదలకు, నిబద్ధతకు దక్కిన గౌరవం అని చెప్పక తప్పదు. ఈ నెల ప్రారంభంలో సైన్యం మొదటిసారిగా కమాండ్ పాత్రలకు మహిళా అధికారులను కేటాయించడం ప్రారంభించింది. వీరిలో దాదాపు 50 మంది ఫార్వర్డ్‌తో సహా కార్యాచరణ ప్రాంతాల్లో యూనిట్లకు చీఫ్‌లుగా వ్యవహరిస్తారు. ఇది ఉత్తర, తూర్పు కమాండ్లలో జరుగుతుంది. ఇక గ్రూప్ కెప్టెన్ ధామి 2003లో హెలికాప్టర్ పైలట్గా నియమితులయ్యారు. 2,800 గంటలకు పైగా విమానాన్ని నడిపిన అనుభవం కలిగి ఉన్నారు షాలిజా దామి. క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా ఉన్నారు. ఆమె వెస్టర్న్ సెక్టార్లోని హెలికాప్టర్ యూనిట్‌కు ఫ్లైట్ కమాండర్‌గా పని చేశారు. ఐఏఎఫ్‌లో గ్రూప్ కెప్టెన్ ఆర్మీలో కల్నల్‌తో సమానం.

# సంక్షేమంలో తగ్గేదేలే..

(మొదటిపేజీ తరువాయి)

మార్చి 10వ తేదీ నుంచి మధ్యాహ్న భోజనంతో పాటు రాగిజావ అమలు ప్రారంభించబోతున్నారు. ఇక, మార్చి 14వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు నిర్ణయం తీసుకున్నారు. బీఏసీ సమావేశంలో అసెంబ్లీ సమావేశాల షెడ్యూలు.. ఎన్ని రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలనే విషయాన్ని ఖరారు చేయనున్నారు. ఇక, మార్చి 18వ తేదీన సంపూర్ణ ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం.. జగనన్న విద్యాదీవెన లబ్ధిదారుల ఖాతాల్లోకి డీబీటీ పద్ధతిలో నగదు జమ చేయనున్నారు. మార్చి 22న ఉగాది రోజున ఉత్తమ సేవలందించిన వాలంటీర్ల పేర్లు ప్రకటించనున్నారు.. వీరికి ఏప్రిల్ 10న అవార్డులు, రివార్డులు అందజేయనున్నారు. మార్చి 23న జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభించనున్నారు. మార్చి 25వ తేదీ నుంచి వైయస్సార్ ఆసరా.. ఏప్రిల్ 5వ తేదీ వరకు కొనసాగనుంది. మార్చి 31న జగనన్న వసతి దీవెన.. ఏప్రిల్ 6న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలు.. ఏప్రిల్ 10న వాలంటీర్లకు సన్మానం.. ఏప్రిల్ 18న ఈబీసీ నేస్తం.. ఇలా వరుస కార్యక్రమాలు, పథకాల అమలు చేయనుంది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

## మహిళల అభ్యున్నతే ప్రగతికి కొలమానం

- మహిళా సాధికారతకు నిరంతరం కృషి
- మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం జగన్

అమరావతి, మార్చి 7 (మనం న్యూస్): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మానవాళిలో సగభాగం మాత్రమే కాక, అభివృద్ధిలోనూ అంతకు మించిన పాత్రను మహిళలు పోషిస్తున్నారని సీఎం కొనియాడారు. ''మహిళల అభ్యున్నతే ఏ సమాజం ప్రగతికైనా కీలకమైన కొలమానం. 2019లో అధికారం చేపట్టిన నాటి నుంచి మన ప్రభుత్వం మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉద్యోగ సాధికారతలపై దేశంలోని మరే ప్రభుత్వమూ పెట్టనంతగా దృష్టి పెట్టింది'' అని సీఎం జగన్ పేర్కొన్నారు. ''జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, 30 లక్షల ఇళ్ల పట్టాలు-22 లక్షల ఇళ్ల నిర్మాణం, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ సంపూర్ణ పోషణ వంటి పథకాలతో గర్భస్థ శిశువు నుంచి పండు ముదుసలి వరకు ప్రతి ఒక్కరి పట్ల ప్రేమ చూపిస్తున్న ఏకైక ప్రభుత్వం మనదే. వారి రక్షణ, భద్రతను దృష్టిలో ఉంచుకుని దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్లతో ఆడబిడ్డల రక్షణలో అందరికన్నా మిన్నగా అడుగులు ముందుకు వేశాం'' అని సీఎం అన్నారు. ''21వ శతాబ్దపు ఆధునిక భారతీయ మహిళ ఆంధ్రప్రదేశ్లోనే అవతరించేలా నిర్ణయాలు తీసుకున్నాం. రాజకీయ పదవుల్లో కూడా చట్టాలు చేసి మరీ సగభాగం ఇచ్చింది మన ప్రభుత్వమే. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్క కుటుంబం, మొత్తం సమాజం ఆడబిడ్డల పట్ల మరింత గౌరవం, శ్రద్ధ కనబర్చేలా నిర్ణయాలు తీసుకోవాలి'' అని సీఎం జగన్ పిలుపునిచ్చారు.

## పెండింగ్ బకాయిలు చెల్లిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

మాట వాస్తవం అన్నారు. వీలైనంత వరకు సమస్యల పరిష్కారానికి మేం ప్రయత్నిస్తూనే ఉన్నాం అని తెలిపారు. ఇక, మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ.. పెండింగ్ క్లైమ్స్ మార్చి నెలాఖరులోగా చెల్లిస్తామని స్పష్టం చేశారు. జీపీఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, మెడికల్ బిల్లులు, టీఏ, ఏపీ జీఎల్ఐఏ అంశాల్లో ఉన్న పెండింగ్ బిల్లులు చెల్లించేస్తున్నాం అని వెల్లడించారు.. పెండింగ్ బిల్లుల పైనే నాలుగు గంటల పాటు చర్చించామని.. ఉద్యోగ సంఘాలకు స్పష్టత ఇచ్చామని.. ఈ నెలాఖరులోగా సుమారు రూ.3 వేల కోట్లు చెల్లింపులు జరుపుతామని వెల్లడించారు మంత్రి ఆదిమూలపు సురేష్. మరోవైపు.. ఏపీ ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గతంలో మాదిరిగా ఛాయ్, బిస్కట్ సమావేశం కాదు.. పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. డీఏ బకాయిలను రెండు క్వార్టర్లల్లో క్లియర్ చేస్తామని హామీ ఇచ్చారు.. మొత్తంగా రూ. 16 వేల కోట్ల బిల్లులు పెండింగులో ఉంటే.. రూ.3వేల కోట్లు క్లియర్ చేస్తామన్నారని.. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసిందని తెలిపారు.. కోవిడ్ వల్ల ఒకటో తేదీన జీతాలివ్వలేకపోతున్నామని ప్రభుత్వం చెప్పింది.. ఈ ప్రభుత్వం ఉన్నంత వరకు కోవిడ్ ప్రభావం ఉంటుందని సెటైర్లు వేశారు.

## వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ని డంపింగ్ యార్డ్‌గా మార్చేస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

స్వేచ్ఛగా తిరగలేని జగన్ ప్రతిపక్ష పార్టీలకు మాత్రం సవాల్ విసురుతున్నాడు. మోదీ, జగన్‌ది నియంత పాలన. వీరివల్ల రాష్ట్ర నాశనం అవుతోందని విమర్శించారు నారాయణ. ఎవరు ఎలా పోటీ చేయాలో జగన్ చెప్పడం విడ్డూరంగా ఉందని, వైసిపికి ఉండేది ఒక సంవత్సరం ఆయుష్షు.. విశాఖ పట్నం సమ్మిట్‌లో 13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. అవన్నీ కాకి లెక్కలన్నారు. పారిశ్రామిక కంపెనీలను తరిమేసి ఇప్పుడు పెట్టుబడులంటే ఎలా అని నారాయణ ప్రశ్నించారు. మూడు రాజధానులు అన్నప్పుడు ఏపీపై పారిశ్రామిక వేత్తలకు నమ్మకం పోయిందన్నారు నారాయణ.

## గజ వాహనంపై ఊరేగుతున్న

# శ్రీ గట్టు వెంకటేశ్వరస్వామి



రామసముద్రం,మార్చి 7, మనం న్యూస్: మండలంలోని చెంబకూరు పంచాయతీ కేంద్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ గట్టు వెంకటేశ్వర స్వామి గజ వాహనంపై ఊరేగారు. ఈ వాహనాన్ని రెడ్డి సంగం వారు నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.అలాగే ఈ కార్యక్రమంలో భాజా బజంత్రీలతో, బాణాసంచా వేడుకలతో ,కోలాట చెక్కభజనలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు భక్తాదులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా

# టీటీడీ మహిళా ఉద్యోగుల రక్తదానం



తిరుపతి (టీటీడీ), మార్చ్ 7, మనం న్యూస్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతిలోని కేంద్రీయ ఆసుపత్రిలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి రక్తదాన శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. మహిళా ఉద్యోగులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జేఈవో లు సదా భార్గవి, వీర బ్రహ్మం, ముఖ్య వైద్యాధికారి డాక్టర్ మురళీ ధర్,సంక్షేమ విభాగం డెప్యూటీ ఈవో శ్రీమతి స్నేహలత,ఆర్ఎంవో డాక్టర్ నర్మద ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బీఆర్డీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో

# ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం



కుప్పం, మార్చి 7, మనం న్యూస్ : కుప్పం పట్టణంలోని బి ఆర్ డి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం విజయవంతం అయింది . ఈ వైద్య శిబిరంలో నోవా సంతాన సాఫల్య వైద్యశాల వైద్యులు డాక్టర్ ఆర్ లావణ్య మరియు డాక్టర్ ఎం హరిత పాల్గొని వైద్య సేవలు అందించారు సంతానం లేని 60 మంది దంపతులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పంలో అంతర్జాతీయ ప్రమాణాలతో సంతానం లేని పేద మధ్యతరగతి దంపతులకు తక్కువ ఖర్చుతో స్కానింగ్ వైద్య పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు వైద్య శిబిరంలో సంతానం లేని దంపతులకు ఉచితంగా స్కానింగ్ చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు సంతానం లేని దంపతులు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ హరిత మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

## వై.సి.పి పట్టభద్రుల ఎమ్మెల్సీ అబ్యర్థి

# గెలుపు కోసం ముమ్మర ప్రచారం



రామకుప్పం, మార్చి 7, మనం న్యూస్ : రామకుప్పం లో మంగళవారం రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పెర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి గెలుపు కోసం మండల వై. సి. పి నేతలు ముమ్మర ప్రచారం చేశారు సి. ఎం వై. ఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధికార్యక్రమాలు చేస్తున్నారు ఓటర్లు గుర్తించి వై. సి. పి అభ్యర్తికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో ఐ. సి. పి మండల అధ్యక్షుడు బాబూరెడ్డి ఎం. పి. పి సుబ్రహ్మణ్యం జడ్. పి. టి. సి నితిన్ కొకన్వీనర్ చంద్రారెడ్డి స్థానిక సర్పంచ్ మురళి నేతలు సంధిల్ అప్పి ప్రసాద్ సంజయ్ జబి యస్వంథ్ రెడ్డి శంకర్ రాఘవరెడ్డి రవి తప్రోజ్ అమ్ములు నావాజ్ సజ్జల రజనీరెడ్డి మధు మురళి శ్రీ వర్ధన్ కార్యకర్తలు పాల్గొన్నారు

### విద్యతోనే మహిళా సాధికారత.. ఆడ పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి



తిరుపతి కార్పొరేషన్, మార్చి 7, మనం న్యూస్: విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి ఐ. ఏ.ఎస్. అన్నారు. ప్రపంచ మాహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ అనుపమ మాట్లాడుతూ మహిళలు తమ బాధలు, సమస్యలను చర్చించుకోవడానికి, నలుగురితో పంచుకోవడానికి ఒక రోజు ఉండాలనే ఉద్దేశ్యంతో మహిళా దినోత్సవం ప్రకటించారని, తొలిసారి అమెరికాలోని చికాగోలో మహిళా దినోత్సవానికి 1908లోనే బీజాలు పడ్డాయన్నారు. పలు దేశాల్లో మహిళలు మహిళా దినోత్సవాలను నిర్వహించుకున్నారన్నారు. అయితే చివరిగా మార్చి 8వ తేదీని మాహిళా దినోత్సవంగా నిర్ణయించడం జరిగిందన్నారు. చిన్నతనం నుండే ఒక గోల్ ఏర్పరుచుకుని సాధించేందుకు కృషి చేయాలని, మహిళలు ఎంత ఎదిగినా ఒదిగి ఉండే లక్షణాలు కలిగి ఉండాలని అప్పుడే తాము అనుకున్నది సాధించగలని చెబుతూ మరోసారి మహిళలందరికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేసారు.

# పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ ఉండాలి

**- కాటమనేని భాస్కర్**

**-ఎన్నికల నిర్వహణలో అనుభవం వున్నా తప్పనిసరి**

**-విధుల నియమావళి చదవాలి: కోనా శశిధర్**



తిరుపతిటౌన్, మార్చి 7, మనం న్యూస్: ఎం.ఎల్.సి. ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడల్సిన భాద్యత ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పై వుందని పట్టభద్రుల నియోజకవర్గ పరిశీలకులు కాటమనేని భాస్కర్ అన్నారు. సూక్ష్మ పరిశీలకులుగా (మైక్రో అబ్జర్వర్లు) గత ఎన్నికల అనుభవం ఉన్న ఎన్నికల సమయంలో తప్పనిసరి విధుల నియమావళి చదవాలని, అర్థం చేసుకోవాలని, సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఉపాధ్యాయ నియోజకవర్గ పరిశీలకులు కోనా శశిధర్ అన్నారు మంగళవారం ఉదయం స్థానిక శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ సావేరి ఆడిటోరియంలో మైక్రో అబ్జర్వర్ల శిక్షణ తరగతులలో ఎన్నికల పరిశీలకులైన కాటమనేని భాస్కర్, కోనా శశిధర్, జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని పలు సూచనలు చేశారు.ప్రకాశం –నెల్లూరు– చిత్తూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు కాటమనేని భాస్కర్ మాట్లాడుతూ శిక్షణ తరగతులలో సూచించిన సూచనలను తప్పని సరి అవగాహన చేసుకుని పాటించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ప్రిసైడింగ్ అధికారుల సమన్వయంతో మైక్రో అబ్జర్వర్లు విధులు నిర్వహించాలని, పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రాల లోపల జరిగి విషయాలను పరిశీలిస్తూ వాటిని నమోదు చేస్తూ పోలింగ్ అనంతరం వాటిని షీల్ కవర్లో భద్రపరిచి రిసెప్షన్ సెంటర్ వద్ద ఎన్నికల పరిశీలకు గాని వారు సూచించిన నోడల్ అధికారికి గాని నివేదిక అందించాల్సి ఉంటుందని అన్నారు. పోలింగ్ కేంద్రాల విధులకు వెళ్ళినపుడు బయటి వ్యక్తుల వద్ద భోజనం వంటివి తీసుకోరాదని, అపవాదు వచ్చే అవకాశం వుంటుందని అన్నారు. మైక్రో అబ్జర్వర్సు కు ఎన్నికల కమిషన్ కొన్ని అంశాలను సూచించిందని, పోలింగ్ కేంద్రంలో జరిగే విషయాలను నమోదు చేయాల్సి ఉంటుందని, పోలింగ్ కేంద్రాల బయట జరిగే విషయాలను పోలీస్ భద్రత చూసుకుంటుందని అన్నారు. ప్రకాశం– నెల్లూరు– చిత్తూరు ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు కోనా శశిధర్ మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లుగా కేంద్ర ప్రభుత్వ,పలు బ్యాంక్ అధికారులను నియమించడం జరుగుతుందని, విధులు కేటాయించిన తరువాత ఎట్టి పరిస్థితులలో గైర్హాజరు కారాదని అన్నారు. తాను జిల్లా ఎన్నికల అధికారిగా రెండుసార్లు అసెంబ్లీ ఎన్నికలు, మరో రెండు సార్లు పార్లమెంట్ ఎన్నికలు రిటర్నింగ్ అధికారిగా పంజాబ్ ఎన్నికలకు అబ్జర్వర్ గా, పలు స్థానిక సంస్థలయిన పంచాయితీ , మునిసిపల్ ప్రత్యక్ష, పరోక్ష ఎన్నికల విధులను నిర్వహించడం జరిగిందని ఆఅనుభవం మేరకు సూచనలు చేస్తున్నామని అన్నారు. ఎన్నికల నిర్వహణలో మనం ప్రభుత్వ ఉద్యోగులుగా ఎన్నికల కమిషన్ సూచించిన విషయాలను తూ.చ. తప్పకుండా పాటించాలని 99.99 తెలిసి ఉన్న మిగిలిన 0.1 కూడా మన సొంత నిర్ణయాలు తీసుకోరాదని ఇది కూడా ఎన్నికల కమిషన్ నుండే నివృత్తి చేసుకోవాల్సి ఉంటుందని అన్నారు. అందుకే గత ఎన్నికలలో అనుభవం ఉన్నా, ఎన్నికల సమయంలో అందించే శిక్షణలో పాల్గొనాలని, విధుల నియమావళి చదువుకొని అర్థం చేసుకొని వ్యవహరించాల్సి ఉంటుందని అన్నారు. ఎంతటి అత్యవసర పరిస్థితుల్లో ఉన్న విధుల కేటాయించిన అధికారులు తప్పనిసరి హాజరు కావలసి ఉంటుందని, ఎట్టి పరిస్థితులలోనూ మినహాయింపు ఉండదని అతిక్రమిస్తే జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారని అన్నారు. ఎన్నికల నిర్వహణ అనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యత అని అన్నారు మైక్రో అబ్జర్వర్ నివేదికలో చిన్న పొరపాట్లకు కూడా తావు లేకుండా ప్రిసైడింగ్ అధికారి సమన్వయంతో నివేదిక రూపొందించి ఆ నివేదిక విషయాలను ఎన్నికల పరిశీలకులకు మాత్రమే అందించాల్సి ఉంటుందని అన్నారు జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ ఎన్నికల పరిశీలకులు సూచించిన విషయాలను మైక్రో అబ్జర్వర్లు పాటించాలని ఈనెల 12న డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు వద్ద ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్ మెటీరియల్ తీసుకొని పోలింగ్ కేంద్రాలకు వెళ్లే సమయంలో మైక్రో అబ్జర్వర్లు వారితో పాటు ప్రయాణించి రాత్రి బస చేయాల్సి ఉంటుందని అన్నారు.

మైక్రో అబ్జర్వర్ల నివేదిక ఎన్నికల పరిశీలకులకు, లేదా వారు సూచించిన నోడల్ అధికారులకు మాత్రమే నివేదికను షీల్ కవర్లో రిసెప్షన్ సెంటర్ల వద్ద అందించాల్సి ఉంటుందని అన్నారు.అంతకు ముందు రిటైర్డ్ జెసి వి.ఆర్.చంద్రమౌళి పోలింగ్ సమయంలో మైక్రో అబ్జర్వర్లుచేపట్టాల్సిన విధులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి, సందేహాలను నివృత్తి చేసారు. ఉపాధ్యాయ నియోజకవర్గ బ్యాలెట్ పింక్ , పట్టభద్రుల నియోజక వర్గ బ్యాలెట్ తెలుపు రంగులో ఉంటుందని అన్నారు. ఉపాధ్యాయులు , పట్టబద్రుల ఓటర్లుగా వుంటారని అందుకే ఓటింగ్ సమయంలో ఉపాధ్యాయ ఓటర్లకు ఎడమ చేతి మధ్య వేలుకు , పట్టబద్రుల ఓటర్లకు చూపుడు వేలుకు మార్క్ వేయనున్నారని వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జెసి డి.కె.బాలాజీ, అడిషనల్ ఎస్ .పి. కులశేఖర్ , జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస రావు, మైక్రో అబ్జర్వర్ల గా విధులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వ , బ్యాంకుల అధికారులు హాజరయ్యారు.

# వైయస్సాఆర్ పార్టీ పట్టుభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

**ప్రచారం చేస్తున్న ఎంపీపీ. వైస్ ఎంపీపీ. మండల కన్వీనర్ వైయస్సార్ పార్టీ నాయకులు**

బంగారుపాళ్యం, మార్చి 7, మనం న్యూస్: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండల వైయస్సార్ పార్టీ యువ నాయకుడు తుంబకుప్పం . కరిడి వారి పల్లి. సదకుప్పం. నల్లగాడు. తూంపాయన పల్లి. పెరుమాలపల్లి. తదితరగ్రామాల్లో వైయస్సార్ పార్టీ జడ్పిటిసి సోమశేఖర్.ఎంపీపీ అమరావతి. వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి. మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి. జిల్లా వైయస్సార్ పార్టీ సేవదల అధ్యక్షులు కిషోర్ కుమార్ రెడ్డి. కొత్తపల్లి వైఎస్ఆర్ పార్టీ యువ నాయకుడు మహేంద్ర. తుమ్మ కుప్పం వైయస్సార్ పార్టీ యూత్ అధ్యక్షులు మంజునాథ్. పలు వైయస్సార్ పార్టీ నాయకులు గ్రామాల్లో తిరిగి వైయస్సార్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్సీ శ్యాం ప్రసాద్ రెడ్డి ని గెలిపించాలని ఓటు వేసే విధంగా చూడాలనిఅభ్యర్థులకు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైయస్సార్ పార్టీ తరపున పోటీ చేస్తున్న పెర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి ని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు వైయస్సార్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థిని ఎందుకు గెలిపించాలంటే గతంలో గొప్పింటి వాళ్లు డబ్బు ఉన్నవాళ్లు పెద్దపెద్ద చదువులు చదివేవారని పేదవారు డబ్బులు లేనివారు ప్రభుత్వ పాఠశాలలో చదివారని మాజీ దిగుంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్రలో ప్రజల బాధలను తెలుసుకొని పేదవాళ్లు గొప్పవాళ్లుగా ఎదగాలని విద్యార్థులకు ఉచితం గా ప్రైవేటు కాలేజీలలో కూడా చదువుకునే అవకాశం కల్పించి గొప్ప చదువులు చదివి పట్టుభద్రులయ్యాము మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి ఉచిత రీ ఎంబర్స్ మెంట్ ద్వారా చదువుకొని మంచి కంపెనీలలో ఉద్యోగాలు జీతాలు తీసుకుంటూ ఉన్నామంటే అది స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి పుణ్యమేన ని ఇవాళ ఎందరో ఇంజనీర్లుగా, డాక్టర్లుగా,నర్సులుగా, చాలామంది ఉద్యోగాలలో ఉన్నారని ఇలా ఈ రోజు రాజశేఖర్ రెడ్డి రుణం తీర్చుకునే రోజు వచ్చిందని అలాగే రాజశేఖర్ రెడ్డి తనయుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూడా విద్యార్థులకు ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి చేస్తూ మంచి మంచి విద్యను అందిస్తున్నారని ఇందుకు ఉదాహరణ ప్రతి ఒక్క పేద ఇంటి బిడ్డ ఉన్నత చదువులు చదివేందుకు అమ్మ ఒడి డబ్బులు వేస్తూ పెద కుటుంబాలు బాగుపడాలని గొప్ప వారుగా మిగిలిపోవాలని రాజు మంచివాడైతే రాజ్యం బాగుంటాదని మనతో కలిసిపోయి ప్రతి ఒక పేదవాని కష్టం తెలుసుకుని మనతో ఏ బంధము లేకపోయినా ఒక అన్నల మన కుటుంబంలో ఒక మనిషిలాగా తోడుగా నిలుస్తున్న మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని



వైయస్సాఆర్ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరుకుంటున్న ప్రతి పేదవారి కష్టము తెలుసుకుని వివిధ కుల వృత్తుల వారికి వారి వారి ఖాతాలో డబ్బులు వేస్తూ ఆదుకుంటు కేంద్ర ప్రభుత్వం సపోర్టు లేకపోయినా ప్రభుత్వానికి రాబడి లేకపోయినా ఇచ్చిన మాట ప్రకారం పతకాలకు డబ్బులు చెల్లిస్తూన్నారు ఆనాడు దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన కాలర్షిప్ లు పెట్టి పేదవారిని ఇంజనీర్లుగా చేశారు అప్పుడు ఆ దివంగత నేత పెట్టిన పథకాల వల్ల మధ్య తరగతి వాళ్ళ పిల్లలు చదువుకొని ఈరోజు మంచి జీతాలు తీస్తూ ఉద్యోగాల్లో స్థిరపడ్డావారిని ఈ రోజు చూస్తున్నాం ఆరోజు ప్రతిఫలం అలా ఈనాడు జగనన్న చేస్తుంది రేపటి రోజున మంచి ఫలితాలు వస్తాయి పెదవాళ్లు ఉన్నవాళ్లుగా మారి ఈ పోటీ ప్రపంచంలో బతకగలగుతు మనం పట్టుబద్రలు అయ్యామంటే ప్రతి ఒక్కరూ ఒకసారి ఆలోచించండి ఆనాటి రాజశేఖర్ రెడ్డి ఫీజు రియింబుర్స్మెంట్ వల్లే కదా లేకపోతే మనం ఎక్కడ ఉండేవాళ్ళం ఆలోచించండి పట్టుభద్రుల ఓటరు లారా మంచికి అవకాశం ఇవ్వండి వైఎస్సార్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి పెర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి కి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించండి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అరుణామరెడ్డి. మార్ కొండయ్య. ప్రతాప్ రెడ్డి. పలు వైఎస్ఆర్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలలో అవసరమైన

## సామాగ్రిని సిద్ధం చేయండి

**-జిల్లా కలెక్టర్**



తిరుపతిటౌన్, మార్చి 7, మనం న్యూస్ : పోలింగ్ ప్రిసైడింగ్ అధికారుల చెక్లిస్ట్ ఆధారంగా సూచించిన దాదాపు 30 రకాల వస్తువులను తప్పనిసరిగా డివిజన్ స్థాయిలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషణ్ కేంద్రాల నుండి పంపిణీ జరిగేలా చూడాలని, జిల్లా కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్లో పోలింగ్ కేంద్రాల వారిగా సిద్ధం చేస్తున్న పోలింగ్ మెటీరియల్ , కలెక్టరేట్ కు చేరుకున్న బ్యాలెట్ పేపర్ల షీల్ బాక్సులను జిల్లా కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ నుండి సిద్ధం చేసి తరలిస్తున్న పోలింగ్ మెటీరియల్ జిల్లాలోని నాలుగు డివిజన్ కేంద్రాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ మరియు రిసెప్షన్ కేంద్రాలకు చెక్ లిస్ట్ మేరకు అందేలా చూడాలని అన్నారు. ఇప్పటికే పోలింగ్ మెటీరియల్ టీచర్ ఉపాధ్యాయ నియోజకవర్గ పోలింగ్ కేంద్రాలకు పింక్ కలర్, పట్టభద్రుల నియోజకవర్గ పోలింగ్ కేంద్రాలకు తెలుపు రంగు బ్యాగులలో సిద్ధం చేసిన పోలింగ్ మెటీరియల్ జిల్లా కలెక్టర్ చెక్ లిస్ట్ ఆధారంగా ప్రతి వస్తువును చెక్ చేసి పలు సూచనలు చేసారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు , పోలింగ్ కేంద్రాల వారిగా మార్క్ డ్ ఓటర్ల జాబితా , మెటల్ , పేపర్, రబ్బర్ స్టాంపులు, 14,14 ఎ , 15, 16 ఫారమ్స్ , పి.ఓ.డైరీ , వంటివి సరిచుడాలని అన్నారు. వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు సి.ఇ.ఓ., ఆర్.ఓ., డి ఇ ఓ వీక్షించే విధంగా వుండాలని, అందుకు సంబంధించిన టెక్నిషియన్లు అందుబాటులో వుండాలని , ఈ 12 , 13 పోలింగ్ కేంద్రాలలో రికార్డయిన వీడియో అందించాలని అన్నారు. అవసరం వున్న కేంద్రాల్లో వీడియో రికార్డు కూడా చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వారి పరిశీలనలో డి ఆర్ ఓ శ్రీనివాస రావు, ఆర్డిఓ కనకనరసా రెడ్డి , స్పెషల్ డిప్యూటి కలెక్టర్ భాస్కర్ నాయుడు, శ్రీనివాసులు, అర్బన్ తహసిల్దార్ వెంకటరమణ, కలెక్టర్ కార్యాలయ సూపరిన్ టెన్ లు పరమేశ్వర స్వామి, భార్గవి, డి టి లు శ్యామ్ , మోహన్ రెడ్డి, రామచంద్ర, జానీ , విజయభాస్కర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



# వైభవంగా ముక్కంటేశ్వరస్వామి తిరణాలు



రామసముద్రం, మార్చి 7, మనం న్యూస్: మండలం లోని ఊలపాడు పంచాయతీ నరసాపురం గ్రామంలో వెలసి ఉన్న శ్రీ ముక్కంటేశ్వర స్వామి తురుణాలు .ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయాన్ని అంగరంగ వైభవంగా తీర్చిదిద్దారు.ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు కలిసి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. కదిరి పున్నమి సందర్భంగా నేటి నుండి మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుపుతారు. తిరున్నాళ్ల కు ఆంధ్ర,కర్నాటక, తమిళనాడు ఇతర ప్రాంతాల నుండి ప్రజలు అత్యధిక సంఖ్యలో హాజరు కావడం విశేషం. ఆలయం నందు బెంగళూరు నుండి పలు, పుష్పలు తెచ్చి అలంకరణ చేశారు, నరసాపురం తిరునాళ్లకు వచ్చే భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటిముందర, ఆలయం నందు అర్చకులు అనిల్ స్వామి ఆధ్వర్యంలో కళ్యానోత్సవం నిర్వహించారు,ఈ ఉత్సవాల్లో గారడిబొమ్మలు, తోలుబొమ్మఆటలు, చెక్కబజనలు,కోలాటాలు , భాజా భజంత్రీలతో స్వామివారి ని పల్లకి పై పురవీధుల్లో ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు, భక్తాదులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ద్రావిడ విశ్వ విద్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం

కుప్పం, మార్చి 7 , మనం న్యూస్ : ద్రావిడ విశ్వవిద్యాలయం మహిళా సెల్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం వర్శిటీ శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వర్శిటీ వైస్ఛాన్సలర్ ఆచార్య తుమ్మల రామకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకలకు గౌరవ అతిథిగా పాల్గొన్న వర్శిటీ రెక్టార్ ఆచార్య టి.అనురాధ మాట్లాడుతూ... పూర్వం ఉన్న పరిస్థితుల కంటే ప్రస్తుత పరిస్థితులు కొంత వరకు మారినా.. నేటి సమాజంలోని వ్యక్తుల ఆలోచనా ధోరణులను మార్చలేకపోతున్నామని పేర్కొన్నారు. ఒక స్త్రీ ఉద్యోగ రీత్యా, చదువు రీత్యా బయటకు వచ్చినప్పుడు వారు ఎదుర్కొంటున్న హేయమైన సంఘటనల గురించి ప్రస్తావిస్తూనే.. చదువుతో పాటు సంస్కారం కూడా నేర్చుకోవాలని, ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వ్యక్తులే దిగజారిన భావాలను కలిగి ఉండటం శోచనీయమన్నారు. ప్రస్తుతం సమాజంలో దిగజారుతున్న విలువల గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించి, తగిన పరిష్కారాలను సూచిస్తూ సమాజంలోని వ్యక్తుల ఆలోచనా ధోరణులు మార్చుకోవాల్సిన ఆవశ్యకత గురించి విపులంగా వివరించారు.గౌరవ అతిథిగా పాల్గొన్న వర్శిటీ రిజిస్ట్రార్ డా.ఎ.కె.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ... మానవ మనుగడలో అత్యంత ప్రధాన పాత్రలు వహించే విద్య, చదువు, సంస్కారాలకు సంబంధించి మనం అధిపతులుగా లక్ష్మీదేవి, పార్వతీ అమ్మవారు, సరస్వతీ దేవి అమ్మవార్లు ఉన్నారన్నారు. మానవజాతి మనుగడకే ప్రాణం పోసింది మగువే అని.. త్యాగంలో, అనురాగంలో తరుగని పెన్నిది మగువ అని, మానవ జాతి మనుగడ స్త్రీమూర్తి పైనే ఆధారపడి వుందన్నారు. మన సంస్కృతిలో స్త్రీ పురుషుల సమన్వయ జీవితాన్ని అర్ధనారీశ్వర తత్త్వంగా భావిస్తామన్నారు. ప్రతి పురుషుడి విజయం వెనుక స్త్రీమూర్తి ఉన్నది అక్షర సత్యం అయితే, ఇది ఎందరో విజేతల జీవితంలో మనకు సాక్షాత్కారింపబడి నిరూపింపబడిరదన్నారు. పురుషుడు ఎప్పుడూ స్త్రీమూర్తిపైనే ఆధారపడ్డవాడని, గృహ చట్టాలకు అధినేత అమ్మే అని, పురుషని వివాహ జీవితంలో ప్రధాన పాత్ర వహించేది భార్యే అనిపురుషుడి జీవితం స్త్రీ మూర్తి సహచర్యం లేకుండా సాగదని స్పష్టం చేశారు. ప్రస్తుత కాలంలో అన్ని రంగాల్లో కూడా స్త్రీలు పురుషులతో సమానంగా కాకుండా అధికంగా విద్య, ఉపాధి రంగాల్లో ఎదిగి సాటిలేని మేటితనంతో రాణిస్తున్నారన్నారు. స్త్రీ చదువుకుంటే కుటుంబం మొత్తం బాగుపడుతుందని భావించినటువంటి మహాత్మ గాంధీ గారి కన్న కలలు నేడు నిజమవడం మనకందరికీ ఎంతో సంతోషదాయమకన్నారు. మన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు బేటీ పడావో.. బేటీ బచావో అన్న ప్రత్యేక పథకాలను రచిస్తూ ముందుకు వెళ్తున్నారని, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్రెడ్డి అమ్మ ఒడి, విద్యా దీవెన, జగనన్న చేదోడు, ఆడవారి పేర్లపై ఇళ్ళ పట్టాలు, వైఎస్సార్ కళ్యాణ కానుక, దిశా వంటి చట్టాలతో స్త్రీ జాతిపట్ల గౌరవాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. దాంపత్య జీవితం, కుటుంబ జీవితం హక్కుల పోరాటం కాదని, అదొక సమన్వయ సూత్రం అని విద్యార్థులకు తెలియజేశారు. వర్శిటీలో ఆసక్తి కలిగిన విద్యార్థులు ఇంటర్న్షిప్కి ఆమె ఆహ్వానించారు.ప్రత్యేక అతిథిగా పాల్గొన్న అడ్వకేట్, మాజీ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోక్సో కోర్టు, చిత్తూరు బి.లీలావతి మాట్లాడుతూ వివిధ చట్టాలు, తాను పరిష్కరింపబడిన ఒకన్ని కేసులను గురించి వివరించారు. వివిద చట్టాలను గురించి వివరించడమే కాకుండా మహిళలను సెల్ఫ్ రెస్పెక్ట్, సెల్ఫ్ ప్రొటెక్టా ఉండమని ఉత్తేజపరిచారు.వర్శిటీ డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య వల్లూరు లోకనాథం,



ఆచార్య జె.వి.సత్యవాణి, ఆచార్య యశోద, వర్శిటీ మహిళా విభాగం కోఆర్డినేటర్ డా.శోభారాణి, అడిషనల్ కోఆర్డినేటర్ డా.కళావతిలు విద్యార్థులకు ఎందరో మహిళల వీరగాథలు, చరిత్రలు చదవటం వలన వారు స్ఫూర్తి పొంది తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పేర్కొన్నారు. చరిత్రలోని ప్రముఖమైన వ్యక్తులందరి గురించి తెలుసుకుని విద్యార్థులు తమను తాము రాబోవు భవిష్యత్తుకు సన్నద్ధం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా పలువురు విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.అనంతరం అతిథులను వర్శిటీ తరపున ఘనంగా శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ వేడుకల్లో రిజిస్ట్రార్ సతీమణి ఆకేపాటి మాధురి, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులుమరియు పి ఆర్ ఓ ఎం ఎస్ దుర్గా ప్రవీణ్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మనం

బుధవారం | 8 | మార్చి | 2023

# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస శిక్షణ

- విద్య ఇష్టపడి చదవాలి.. కష్టపడి చదవకూడదు
- ఒక లక్ష్యంతో చదివితే విద్య సులభతరం
- కేవలం చదువుపైనే ధ్యాస ఉండాలి.. యువత సెల్ఫోన్ మోజులో పడొద్దు
- యువత భవిత బాధ్యత.. క్రియేటర్ క్రిష్ణ



గోరంట్ల మార్చి 7 మనం న్యూస్ క్రియేటర్ అనే పేరు రెండు తెలుగు మాట్లాడే రాష్ట్రాలలో చాలా సుపరిచితమైన మరియు బాగా గుర్తించబడిన పేరు. అభిరుచితో, క్రియేటర్ కృష్ణ గత 15 సంవత్సరాలుగా వ్యక్తిత్వ వికాస రంగంలో ఉన్నారు. ఇప్పటి వరకు 10 లక్షల మందికి పైగా వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇచ్చాడు. సామాజిక అవగాహన, పెంపకం, సాధికారత, నైతికత, విద్యార్థి జీవితం, కుటుంబ శ్రేయస్సు, ఆత్మహత్య ధోరణి, మానవీయ విలువలు మొదలైన అనేక విషయాలపై 10వేల కంటే ఎక్కువ సెమినార్లు ఇచ్చారు. అతను అనేక ప్రసిద్ధ కార్పొరేట్ మరియు సామాజిక సంస్థలు, వారి ఉద్యోగులు, విద్యార్థులు మరియు జట్లకు సాధికారత కల్పించడం. తన గొప్ప మార్గదర్శకత్వం మరియు సాధికారత మరియు వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలతో, అతను ఆత్మహత్య చేసుకోవాలనుకునే రెండు తెలుగు మాట్లాడే రాష్ట్రాల నుండి చాలా మంది యువత ప్రాణాలను కాపాడాడు. అతను వ్యక్తిత్వ వికాస విషయాలపై అనేక పుస్తకాలు వ్రాసాడు, ' నేను 'అనే పుస్తకం అనేక లక్షల ప్రింట్లు అమ్ముడవడంతో సంచలనం సృష్టించింది.క్రియేటర్ తన సంపాదనలో గణనీయమైన భాగాన్ని సామాజిక కారణాల కోసం ఖర్చు చేస్తాడు. అతని సంపాదనలో 30శాతం దాతృత్వ ప్రయోజనాల కోసం, 10 శాతం వృద్ధాశ్రమాలకు, 10శాతం అనాథ పిల్లలకు మరియు 10 శాతం మానసిక వికలాంగ పిల్లలకు విరాళంగా ఇస్తున్నారు.క్రియేటర్ 24 గంటలు మరియు 30 గంటలు నాన్స్టాప్ పర్సనాలిటీ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెమినార్లను అందించి రెండు రాష్ట్ర రికార్డులను సృష్టించింది. ఆయనే క్రియేటర్ కృష్ణ.దివంగత డాక్టర్ అబ్దుల్ కలామ్ తో కూడా వేదికను పంచుకున్నారు. పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలోవ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమాలు మరియుపరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో విద్యార్థులలో భయాన్ని పారద్రోలి మంచి విద్యను అభ్యసించాలని ప్రధాన ఉద్దేశంతో పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే.... గోరంట్ల మండలం లోని పలు కళాశాలలు పాఠశాలల్లో

సోమవారం క్రియేటర్ కృష్ణ నేతృత్వంలో స్థానిక సి ఐ సుబ్బారాయుడు ఆధ్వర్యంలో మండలంపరిధి లోని కమ్మల వాండ్లపల్లి వద్దనున్న బెస్ట్ యూనివర్సిటీ , పట్టణంలోని వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ మరియు బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో యువత, భవిత, బాధ్యత, వ్యక్తిత్వ వికాస శిక్షణ పై ప్రముఖ వ్యక్తిత్వ వికాస శిక్షణపై విద్యార్థులకుపరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో విద్యార్థులలో భయాన్ని పారద్రోలి మంచి విద్యను అభ్యసించాలని ప్రధాన ఉద్దేశంతో పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు సిఐ సుబ్బరాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పట్టణం లోని వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు పెద్ద ఎత్తున పాఠశాల ఆవరణలో విద్యపై అవగాహన క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రియేటర్ కృష్ణ మాట్లాడుతూ.... విద్యార్థులు తమ విద్యాభ్యాసంలో ఇష్టపడి చదవాలి గాని ఎప్పుడు కష్టపడి చదవ కూడదని, మానసిక ప్రశాంతత విద్యార్థులకు ఎంతో అవసరమని, పరీక్షల సమయంలో ఎవరు ఎలాంటి అపోహాలకు భయానికి గురి కాకుండా ధైర్యంగా చదవాలని,, సినిమాలు, సెల్ ఫోన్లకు బానిస కాకుండా కేవలం చదువుపై మాత్రమే ధ్యాస ఉంచుకోవాలని, మదర్ తెరిసా, ఝాన్సీ లక్ష్మీబాయి , అబ్దుల్ కలాం లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకొని ఒక లక్ష్యంతో చదివితే విద్యా సులభతరంగా ఉంటుందని,సులువుగా ఉంటుందన్నాలాగే తల్లిదండ్రులను హీరోలుగా గుర్తించాలని, పుస్తకాలను దైవంగా భావించాలన్నారు. తెల్లవారుజాము 4 గంటల నుండి 6. గంటల వరకు చదివితే పగలు ఆరు గంటలు చదివే సమానమని, ప్రతి ఒక్కరూ పరీక్షల సమయంలో తినుబండారాలను జంక్ ఫుడ్స్ ను తినరాదని, కేవలం ఇళ్లలో వండిన ఆహారాన్ని భుజించాలని, పుస్తకాలను దేవుడిగా భావించి, ఇష్టపడి చదివినప్పుడే బంగారు బాటకు పునాదులు పడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది,పోలీస్ సిబ్బంది విద్యార్థులు. పాల్గొన్నారు. తద నంతరం పాఠశాలల సిబ్బంది విద్యార్థుల పట్ల, విద్యాభివృద్ధి కోసం, విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని, చెడు అలవాట్లు ఉండకూడదని, దైవంగా భావించాలని, కష్టపడి చదివి తల్లిదండ్రులకు గురువులకు, మన గ్రామానికి మన జిల్లాకు మన రాష్ట్రానికి మన దేశానికి మంచి పేరు తేవాలని, విద్యార్థిని విద్యార్థులకు మంచి అలవర్చుకోవాలి ఎలా అలవర్చుకోవాలని ఉద్దేశంతో సీఐ సుబ్బరాయుడు క్రియేటర్ కృష్ణ ద్వారా విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించడం ఎంతో అభినందనీయమని పలువురు కొనియాడారు. క్రియేటర్ కృష్ణ ప్రసంగం విద్యార్థిని,విద్యార్థులు అధ్యంతం ఆసక్తిగా, ఉల్లాసంగా తిలకిస్తూ, ఆలకిస్తూ సంతోషంగా చప్పట్లతో ఆస్వాదించారు.

## రేపు చందమూరు విజయ్ మొదటి వర్ధంతి



చెన్నేకొత్తపల్లి మార్చి 7 మనం న్యూస్: తెలుగుదేశం పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి, టిడిపి పార్టీ వీరాభిమాని, పరిటాల కుటుంబ ముఖ్య అనుచరుడు చెన్నేకొత్తపల్లి మండలం చందమూరు విజయ్ మొదటి వర్ధంతి వేడుకలను వారి స్వగృహం చందమూరు నందు నిర్వహిస్తున్నామని విజయ్ కుటుంబ సభ్యులు ఒక ప్రకటనలో తెలియజేశారు.

## ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



అమరాపురం,మార్చి 07,మనంన్యూస్: అతి పురాతన ప్రసిద్ధిగాంచిన ఐతిహాసిక క్షేత్రమైన నిడగల్లులో రాఖీ పౌర్ణమి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వాటికీ ఉదయం వివిధ అభిషేకములు నిర్వహించి,ప్రత్యేక అలంకరణ చేసి మహామంగళ హారతి,తీర్థ ప్రసాద వినియోగం చేపట్టారు.కదిరి పూర్ణిమలో భాగంగా స్వామి వారి దేవాలయం ప్రాంగాణంలో అర్చకులు హరి స్వామి తదితరులు మంత్ర వేదములలో పౌర్ణమి సందర్భంగ చక్ర స్నానాలు ఆచరించారు. పౌర్ణమి వేడుకలు సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలకు గుడిబ ఒడ మండలం,కరికెర గ్రామ వంశస్తులు శ్రీ ప్రసన్న కుమార్ వారి ఆధ్వర్య ంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆగమ ప్రవీణులు నరసిం హ భట్టర్,దేవాలయం ప్రధాన అర్చకులు హరీష్ స్వామి తదితరులు ఈ ప్రాంత భక్తులేకాక మడకశిర,ఉరవకొండ,అమరాపురం, గుడిబండ, వదనక ల్లు,పావగడ,ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న దేవరాజ్ కుటుంబానికి చేయూత

- మాజీ ఎమ్మెల్యే ఈరన్న



మడకశిర,మార్చి 07,మనంన్యూస్: అమరాపురం మండలం శివరం గ్రామానికి చెందిన హిందూపురం పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ దేవరాజు భార్య అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూర్ లోని ఎంఎస్ రామయ్య అస్పత్రిలో చికిత్స పొందుతున్న సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే,టిడిపి ఇంచార్జీ మద్దనకుంట ఈరన్న బెంగళూరు వెళ్లి అస్పత్రిలో ఉన్న ఆమెను పరామర్శించారు.ఆమె ఆరోగ్యపరిస్థితులపై అరాతీసి ఆమె చికిత్సలు కోసం తనవంతు బాధ్యతగా రూ 21వేలు ఆర్థిక సహాయంచేసి ధైర్యంగా ఉండాలని దేవరాజుకు మనోధైర్యం నింపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నరసింహ మూర్తి,ఎస్సీ సెల్ నాయకులు కెంచప్ప,ఈశ్వరప్ప,పేలుబండ మంజునాథ్ తదితరులు ఉన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం



కదిరి మార్చి 07మనం న్యూస్:కదిరి పట్టణంలో ఔఐఇ కార్యాలయం నందు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ టీడీపీ అభ్యర్థి భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి తరపున కదిరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంఛార్జి మాజీ శాసన సభ్యులు కందికుంటవెంకటప్రసాద్ పట్టభద్ర ఓటర్లను కలసి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ఈ సందర్భంగా పట్టపద్రులను కోరారు, కదిరి నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు పెందుర్తి శ్రీనివాసరావు. జిల్లా టిడిపి అధికార ప్రతినిధి బండారు మనోహర్ నాయుడు, టౌన్ పార్టీ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ ఎల్ఐసి నరసింహులు,మరియు పట్టణపార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపిద్దాం



సోమందేపల్లి మనం న్యూస్ ఈనెల 13వ తారీఖున జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాయుల అభ్యర్థి రామచంద్రారెడ్డి పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీందర్ రెడ్డిలను అఖండ మెజారిటీతో గెలిపించాలని పెనుగొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ పేర్కొన్నారు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు సచివాలయాలు ప్రభుత్వ పాఠశాలలో మరియు ప్రైవేట్ పాఠశాలలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో పోటీ చేయుచున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రులఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నుపూస రవీంద్ర రెడ్డిని మరియు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పెనుగొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ పేర్కొన్నారు కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరత్నం జడ్పిటిసి డిసి అశోక్ సత్యసాయి జిల్లా సేవల అధ్యక్షుడు వేణుగోపాల్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి.ఎల్లారెడ్డి ఉపాధ్యాయులు సచివాలయ సిబ్బందినాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి ఓటేద్దాం...

# బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం

శింగనమల మార్చి 07(మనం న్యూస్): తెలుగుదేశం పార్టీ పార్లమెంటు అధ్యక్షులు కాల్వ శ్రీనివాసులు ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి శింగనమల నియోజక వర్గద్విసభ్య కమీటి సభ్యులు ముంటి మదుగు కేశవరెడ్డి అలంనర సానాయుడు ఆదేశాల మేరకు శింగనమల మండలం క్లస్టర్ 4 కల్లుమడి గ్రామంలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి తరపున జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు దెందులూరు మాజీ శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు మాట్లాడుతూ.. పశ్చిమ రాయల సీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగు దేశం అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి కి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి జగన్ ప్రభుత్వానికి తగిన బుద్ధిచెప్పి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుందామని, భూమిరెడ్డికి ఓటు వేయడం ద్వారా రాబోయే తెలుగుదేశం ప్రభుత్వంలో నిరుద్యోగ సమస్యకు పరిస్కారం చూపుతాముఅన్నారు. నిరుద్యోగుల పట్ల జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని దృష్టిలో ఉంచుకుని



ప్రతి ఒక్కరూ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి ప్రథమ (1) ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అందుకు నిరుద్యోగులు పట్టభద్రులు ఓటు వేయించాలని అభ్యర్థి ంచారు. కార్యక్రమంలో దాసరి గంగాధర్, మాజీ ఎంపీటీసీ కూళ్ళాయప్ప, క్లస్టర్ 3 ఇంచార్జ్ యం.ఆదినారాయణ, క్లస్టర్ 4 ఇంచార్జ్ బండిపర శురాం, తెలుగు యువత అధికార ప్రతినిధి బ్యాళ్ళ సుదర్శన్, శింగనమల నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, వాణిజ్య విభాగం కార్యదర్శి డేరంగుల శంకరయ్య, బెస్తసాధికారిక పార్లమె ంట్ అధ్యక్షులు బెస్త అమర్నాథ్, కల్లుమడి గ్రామ కమిటీ అధ్యక్షులు సుధాకర్ నాయుడు, మల్లేష్,కంబగిరి, శ్రీనాథ్, రాజు,చిన్న, హేమం త్,వేణు, శేఖర్, శంకర్, రామాంజి,జీవన్ కుమార్,అంజి, ఎర్రిస్వామి, క్రిష్ణమూర్తి, కూళ్ళాయప్ప, గ్రామ కమిటీ అధ్యక్షులు రంగస్వామి, కుమార్, పుల్లయ్య,సోమప్ప, అమర్ నాథ్,అంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ గెలుపునకు టీడీపీ నాయకుల ముమ్మర ప్రచారం

గోరంట్ల మార్చి 07 మనం న్యూస్ పట్టభద్రులారా యువగళాన్ని మండలిలో వినిపించేందుకు ఎమ్మెల్సీ టిడిపి అభ్యర్థి రామ్ గోపాల్ రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపిద్దామని మండల టిడిపి నాయకులు గోరంట్ల పట్టణ ంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గోరంట్ల పట్టణంలో టిడిపి నాయకులు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు, పెనుగొండ అసెంబ్లీ నియోజకవర్గం టిడిపి మాజీ ఎమ్మెల్యే పార్థసారథి ఆదేశాల మేరకు మండల కన్వీనర్ సోమశేఖర్ ఆధ్వర్యంలో పలువురు టిడిపి నాయకులు గోరంట్ల పట్టణంలోని శ్రీ శాంతినికేతన్ కాన్వెంట్ , శ్రీధర్ రెడ్డి కోచింగ్ సెంటర్ మరియు పలు కాలనీలలో పలువురు పట్టభద్రులు కలిసి పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో టిడిపి తరపున పోటీ చేయుచున్న భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి కి మొదటి (1) ప్రాధాన్యత ఓటును వేసి వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, పట్టభద్రులు, నిరుద్యోగులు, ప్రయివేటు ఉద్యోగుల సమస్యలను శాసన మండలిలో వినిపించే విధంగా చేయాలని పట్టభద్రుల ఓట్లను అభ్యర్థిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... గత టిడిపి ప్రభుత్వ పాలనలో మీ పరిస్థితి ఎలా ఉంది? ఇప్పుడు ఎలా ఉందో? మీరే ఆలోచించి ఓటు వేయాలని, గ్రామాల లోని రైతులు అప్పులు చేసి తమ పిల్లల్ని చదివించారని, చదువులు పూర్తి అయిన అటు ఉద్యోగాలు రాక.... ఇటు గ్రామాల్లో వ్యవసాయం చేసుకోలేక....తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, టిడిపి హయాంలో కియాలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయించడం వల్ల నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు. చంద్రబాబు కల్పించారని, జగన్ ప్రభుత్వంలో కొత్త పరిశ్రమలు రాకపోగా.... వచ్చినవి కూడా భయపడి వెనక్కు వెళ్లిపోయే పరిస్థితి దాపు రించిదని, అందుకే ఈ ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెప్పేందుకు ఎమ్మెల్సీ ఎన్నికలు సరైన వేదిక అని, గతంలో ఉపాధ్యాయులకు చంద్రబాబు క్రమం తప్పకుండా జీతాలు ఇచ్చే వారిని, కానీ ఇప్పుడు పరిస్థితి ఎలా ఉందో మీరే అర్థం చేసుకోవాలని, వీటన్నిటిని మేధావులైన మీరు అర్థం చేసుకొని రాంగోపాల్ రెడ్డి ని గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ పార్లమెంట్ఉపాధ్యక్షుడు కురుమల జయరాం, బీసీ సెల్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి గిరిధర్ గౌడ్, బీసీ సెల్ పార్లమెంట్ కార్యదర్శి బీరే వేణు, చాకలి రామచంద్ర, గోరంట్ల పట్టణ ప్రధానకార్యదర్శి సోమశేఖర్, దేవరకొండ ఉమా శంకర, తిప్పరాజుపల్లి శీన, బొబ్బిలి రామ్మోహన్ తదితర టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మ రథోత్సవం

- పోటెత్తిన భక్తజన సందోహం



మడకశిర,మార్చి 07,మనంన్యూస్: మండలకేంద్రమైన రొళ్ల శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన మంగళవారం స్వామి వారి బ్రహ్మ రథోత్సవం భక్తులు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు.ఉదయం స్వామి వారికి వివిధ ప్రత్యేక పూలను జరిపించి,ప్రత్యేక అలంకరణ చేసి మహామంగళ హారతి,తీర్థ ప్రసాద వినియోగం చేపట్టారు.స్వామి వారి ఉత్సవమూర్తిని రథంలో కూర్చుండ బెట్టి భక్తులు రథంలాగి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు.దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన క్రాయక్రమం చేపట్టారు. బ్రహ్మోత్సవంలో పాల్గొన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాకమిటి నిర్వాహకులు ఏర్పాట్లు చేయగా,ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనియ సంఘటనలకు తావు లేకుండా సిసి ఎం.సురేష్ బాబు ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ వెంకటరమణ తమ పోలీసు సిబ్బందితో గట్టి పోలీసు బందోబస్తు చేపట్టారు.స్వామి వారి బ్రహ్మ రథోత్సవం కార్యక్రమంలో ఇసుక వేస్తే నెలరాలనంతగా భక్తజనం పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అబ్జర్వర్ సురేష్

బ్రహ్మసముద్రం.మార్చి.7. (మనం న్యూస్) బ్రహ్మ సముద్రం మండల కేంద్రము లో నీ యం యల్ సి. ఎన్నికల పోలింగ్ కేంద్రాల ను ఎన్నికల అబ్జర్వర్ సురేష్ తనికీ నిర్వహించారు.గదు లయందు వెంటి వెంటిలేషన్ ,విద్యు త్తు. తది తర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు సూచిస్తూ 13 తేదీన జరుగుతున్న ఎన్నికల దృష్ట్యా ఓటర్లకు.ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని అధికారులకు తెలియ చేశారు. ఈ కార్య క్రమంలో.అబ్జర్వర్ సురేష్.ఎస్కార్ట్ చెన్నకేశవులు. ఎం ఈ ఓ. ఒబులప తి .పాల్గొన్నారు.

## శోభకృత్ నామ సంవత్సర పంచాంగం విడుదల



తిరుపతి (టీటీడీ),మార్చి 7, మనం న్యూస్: టీటీడీ ముద్రించిన శోభకృత్ నామ సంవత్సర పంచాంగాన్ని ఈవో ఎవి ధర్మారెడ్డి మంగళవారం తన కార్యాలయంలో విడుదల చేశారు.ఈ సందర్భంగా ఈవో ధర్మారెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఏటా లాగానే రాబోయే నూతన తెలుగు సంవత్సరాది శోభకృత్ నామ సంవత్సర పంచాగం ముద్రించినట్లు చెప్పారు. బుధవారం నుంచి తిరుమలలో రూ.75 చెల్లించి భక్తులు వీటిని కొనుగోలు చేయవచ్చని అన్నారు. మిగిలిన ప్రాంతాల్లో మార్చి రెండో వారం నుంచి అందుబాటులో ఉంచుతామని అన్నారు.జేఈవోలు శ్రీమతి సదా భార్గవి, వీర బ్రహ్మం, ఎఫ్ఎ సిఏవో బాలాజి, పిఆర్వో డాక్టర్ రవి, ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి రామరాజు పాల్గొన్నారు.

## టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్‌కు ఓట్లేయండి

### ఇతర పార్టీల అభ్యర్థులను ఓడించండి

### కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వూకా విజయ్ కుమార్ పిలుపు



తిరుపతి, మార్చి 7, మనం న్యూస్: తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వూకా విజయ్ కుమార్ పేర్కొన్నారు. తిరుపతిలో మంగళవారం 31 వ డివిజన్లో కంచర్ల శ్రీకాంత్ కు మద్దతుగా ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. టిడిపి అభ్యర్థిని గెలిపించాలని, వైకాపా పార్టీ బలపర్చిన అభ్యర్థులను ఓడించాలని ప్రతి ఒక్కరికీ విన్నవించారు.అధికార పార్టీ కి ఇవే చివరి ఎన్నికలని చెప్పారు.ఈ సందర్భంగా క్లస్టర్ ఇంచార్జ్ దంపూరి భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో ఉన్న దారుణ పరిస్థితులలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులే గెలుపొందాలని, రానున్న 2024 ఎన్నికలలో ప్రజలు తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో 31 వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు బాల ఆ పార్టీ నాయకులు ముని కృష్ణ, గజేంద్ర, గంధం బాబు, రాజయ్య,చరణ్, రేఖ, సునీత తదితరులు పాల్గొన్నారు

## ఆంగళ్లులో 17న గొర్రెల సంత, టమాటా మార్కెట్ గేటు వేలం పాటలు

### హోరాహోరీగా సాగనున్న వేలం పాటలు



కురబలకోట, మార్చి 7, మనం న్యూస్: రాయలసీమలోనే పేరొందిన మండలంలోని అంగళ్లు గొర్రెల సంత గేటు వేలం పాటలు ఈనెల 17న అంగళ్లు పంచాయతీ కార్యాలయం నందు ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఆగ్రామ సర్పంచ్, జనం మనిషి పోరెడ్డి విశ్వారెడ్డి, కార్యదర్శి ఎంటీజీ ప్రసాద్ తెలిపారు. ఆదే రోజు టమాటా మార్కెట్, ప్రతి గురువారం జరిగే కూరగాయల వారపు సంత గేటు వేలం పాటలు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. గొర్రెల సంత, టమాటా మార్కెట్ గేటు వేలం పాటల్లో పాల్గొనదలచిన వారు ముందుగా రూ.5 లక్షలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ సంతల గేటు వేలం పాటలు ప్రతి ఏటా ఆసక్తికరంగానే కాకుండా రసవత్తరంగా సాగుతాయి. పోటాపోటీగా హోరాహోరీగా జరుగుతాయి. ఆశ్చర్యాన్ని కల్గించేలా లక్షల్లో గుత్తేదార్లు పాట పాడుతారు. రాయలసీమలోనే ఇక్కడ జరిగే గొర్రెల సంత ప్రసిద్ధి. రాయలసీమ వ్యాప్తంగా గేటు వేలం పాటలు దక్కించుకోడానికి గుత్తేదార్లు పాల్గొంటారు. ఈసారి కూడా ఆసక్తిగల వారు ఈ గేటు వేలం పాటల్లో పాల్గొనాలని వారు కోరారు.

## నిజాయితీపరులను శాసనమండలికి పంపిద్దాం

### -పట్టభద్రులారా ఆలోచించి ఓటెద్దాం

### -డాక్టర్ చంద్రప్ప



శ్రీకాళహస్తి మనం న్యూస్ మార్చి 7 భారతీయ జనతా పార్టీ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ చంద్రప్పతూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఉమ్మడి చిత్తూరు,నెల్లూరు ప్రకాశం జిల్లాలు ఎమ్మెల్సీ అభ్యర్థి సన్నారెడ్డి దయాకర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని నాయుడుపేట పట్టణంలోని ఎల్ఐసి ఆఫీసు, రైల్వే స్టేషన్ ఆవరణం, ఎమ్మార్వో కార్యాలయం,ఉద్యోగస్తులను, కలిసి కరపత్రాలను అందిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు.ఉద్యోగస్తులు స్పందిస్తూ తమ మొదటి ప్రాధాన్యత ఓటు తప్పకుండా వేసి బిజెపి ఎమ్మెల్సీఅభ్యర్థి దయాకర్ రెడ్డి గెలుపుకు కృషి చేస్తామని చంద్రప్ప కి తెలియజేశారు,ఈ సందర్భంగా చంద్రప్ప మాట్లాడుతూ భారతదేశం ఈనాడు అభివృద్ధి దిశగా పయనిస్తూ ఉందంటే అందుకు కారణం మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలేనని ప్రతి కార్యకర్త గర్వంగా ప్రజలకు తెలియజేయాలని, భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు పునికి పుచ్చుకొని ఎన్నో సమస్యలపై పోరాడే యువ నాయకుడు ఇటువంటివారిని శాసనమండలికి పంపిస్తే మన సమస్యలను పరిష్కరించే విధంగా పోరాడుతాడని నీతి నిజాయితీ గల వ్యక్తి అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో అరవింద్ విష్ణు, పవన్ కుమార్, ఎల్ఐసి ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించడంలో నిబద్ధతతో తమదైన శైలిలో స్పందించే

# ఇద్దరు ఎమ్మెల్సీ అభ్యర్థులని గెలిపించండి

### తిరుపతి ఎంపీ గురుమూర్తి




ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు పట్టణంలోని వి.పి.ఆర్ కన్వెన్షన్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది.ఈ సమావేశంలో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే బడుగు బలహీనవర్గాల ఉన్నతి కోసం పాటుపడుతూ వారికి రాజ్యాధికారం అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అని అన్నారు. పద్దెనిమిది ఎమ్మెల్సీ స్థానాలలో అగ్రభాగం బడుగు బలహీన వర్గాలకు కేటాయించిన ఘనత కూడా మా నాయకుడు జగన్మోహనరెడ్డిదే అన్నారు.ఆలాగే నేడు ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్ ఇద్దరు అభ్యర్థులు కూడా సేవ చేయడంలో ఒకరిని మించిన వారు మరొకరని అలాంటి వారు చట్ట సభలకు ఎన్నికయితే మరింత మందికి సేవ చేసే అవకాశం ఉంటుందని వారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మంచి మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.ఉద్యోగ కల్పనలో విప్లవాత్మక మార్పులు తెచ్చి ఓ పక్క గ్రామ స్వరాజ్యం మరోపక్క నిరుద్యోగ యువతకి ఉద్యోగ కల్పనే లక్ష్యంగా సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షల ఉద్యాగాలు కల్పించిన మన ప్రభుత్వానికి మన ప్రియతమ నేత జగనన్నకి అండగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఇటీవల వైజాగ్లో జరిగినటువంటి గ్లోబల్ ఇన్వెస్ట్ ఇండియా సమ్మిట్లో చాలా కంపెనీలు తిరుపతి పార్లమెంట్ పరిధిలో పెట్టుబడులు పెట్టేందుకు సుముకత చూపాయని వాటిలో జిందాల్ స్టీల్స్, మరికొన్ని ఐటీ, నాన్ ఐటీ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం చేసుకొన్నాయాని ఆలాగే ఇది వరకే పెట్టుబడి పెట్టేందుకు అన్ని రకాల అనుమతులు పొంది పనులు మొదలు పెట్టేందుకు సిద్ధంగా ఉన్న క్రిబ్కో కంపెనీ కాని ఇవన్నీ పూర్తయితే పట్టభద్రులు అందరికీ అపారమైన ఉద్యోగ అవకాశాలు వస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి జిల్లా పార్టీ అధ్యక్షుడు ఎన్. రాంకుమార్ రెడ్డి, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు వి.ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్వీ ఉన్నత పాఠశాల 137 వ వార్షికోత్సవం




తిరుపతి, మార్చి 7, మనం న్యూస్ : తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ఉన్నత పాఠశాల 137వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దేవస్థానం విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం.భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాలకు చేరుకోవాలన్నారు.ప్రత్యేక అతిథిగా విచ్చేసిన స్విమ్స్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వి.వనజాక్షమ్మ మాట్లాడుతూ, విద్యార్థులు చక్కటి ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె. సంధ్య ఆధ్వర్యంలో 137వ క్రీడా మరియు పాఠశాల వార్షికోత్సవం గణంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సంధ్య మాట్లాడుతూ విద్యార్థులు విద్య నేర్చుకునే టప్పుడు కుల మతాలు పేద ,ధనిక అడ్డు రాకూడదని ఆమె తెలిపారు. విద్యార్థులు పట్టుదలతో క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరు విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అప్పుడే మనం అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతామని తెలియజేశారు. పట్టుదల ఉంటే సాధించలేని ఏది లేదని తెలిపారు . పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ప్రెసిడెంట్ విద్యార్థులకు నగదు బహుమతి పురస్కారం 60000-/అందించారు.

అలాగే ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు వివిధ విభాగాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు మరియు ప్రశంసా పత్రాలు అందజేశారు.అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ఎంతో అద్భుతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హేమంత్ ,కుమార్, గోపి నాయుడు,మునిరత్నం నాయుడు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు

## అంగరంగ వైభవంగా శ్రీ అమ్మాభగవాన్ జన్మదిన వేడుకలు

### - దేశ విదేశాలనుండి భారీగా తరలివచ్చిన భక్తులు

### -బాలీవుడ్అండ్ కొలీవుడ్ సెలబ్రటీలహవా

### -వి ఐ పి ల కోలాహళం




వరదయ్యపాలెం, మార్చి 7, మనం న్యూస్: మండలంలోని భత్తలవల్లం లోవెలసిన శ్రీ అమాభగవాన్ 74వ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా మంగళవారం నాడు జరిగాయి.ఈ సందర్భంగా శ్రీ కృష్ణాజీ, చేతుల మీదుగా వికలాంగులకు ట్రైసైకిల్స్ -13, వీరచైర్ -13, క్రచర్స్ -08, చెవిటి మిషన్ -24, వాకాకచర్స్ -02, బ్లయిండ్ స్టిక్స్ -91, యాలోజిస్టిక్స్ -1, వాక్సర్ -2 పరికరాలను ఉచితంగా అందజేశారు.ఈ వేడుకులలో పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉందని, అమ్మా భగవానుల దీక్షతో సకల రోగ నివారణ, ఐశ్వర్యం, రైతులు పాడిపంటలతో, మహిళ్ళలు పసుపుకుంకాలతో సుఖంగా జీవించాలని మనసారా ఆశీర్వధించారు,భగవాన్ జన్మదిన సందర్భంగా కల్చరల్ పోగ్రాంను ఏర్పాటు చేసామని నేడు అందరూ సంతోషంగా అనుభూతి చెందాలని కృష్ణాజీ తెలిపారు ఈ సందర్భంగా వికలాంగుల పరికరాలను అందించారు. ఈ కార్యక్రమంలో లోక ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజి,జనరల్ మేనేజర్ సునీల్ జి,ట్రస్ట్ ప్రతినిధి ఉమాపతి దాసాజీ,డీఎస్పీ జగదీష్ నాయక్,సిఐలు శ్రీనివాసులు,శివ కుమార్ రెడ్డి,ఎస్సైలు నాగార్జున రెడ్డి, అరుణ్ కుమార్ రెడ్డి, హనుమంతప్ప,స్థానిక నాయకులు మాజీ సర్పంచ్ తిలక్ బాబు, సి ఎల్ న్ పల్లి సర్పంచ్ వేణుగోపాల్, వాక్స్ బోర్డ్ డైరెక్ట ర్ లు అబ్దుల్,లతీఫ్,ప్రసాద్, తొండూరు సర్పంచ్ రమణయ్య,ఉదయ్ కుమార్ లక్ష్మీనారాయణ, గుత్తి త్యాగరాజు ,తదితరులు పాల్గొన్నారు.

## అన్నమయ్య, కడప జిల్లాల్లో 23 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

### మూడు మోటారు సైకిళ్లతో, 6గురు అరెస్టు



తిరుపతి, మార్చి 7, మనం న్యూస్ క్రైమ్ : అన్నమయ్య, కడప జిల్లాల్లో సోమవారం రాత్రి 23 ఎర్రచందనం దుంగలు, మూడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని ఆరుగురు స్మగ్లర్లను టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్సు ఎస్పీ కే. చక్రవర్తి ఆదేశాల మేరకు డీఎస్పీ మురళీధర్ అధ్వర్యంలో ఆర్ఐలు కృపానంద, చిరంజీవులు టీమ్ లు సోమవారం కూంబింగ్ చేపట్టాయి. ఆర్ఎస్ఐ ఆలీబాషా బృందం అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు, బాలపల్లి ఈస్ట్ ఫారెస్టు బీట్ పరిధిలో కూంబింగ్ చేస్తుండగా, కొంత మంది ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. వారిని చుట్టుముట్టి ముగ్గురిని పట్టుకున్నారు. నవీన్ అనే వ్యక్తి పారిపోయాడు.వీరి నుంచి ఒక మోటారు సైకిల్, 11ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడిన వారిని రైల్వే కోడూరు మండలానికి చెందిన మణికంఠ (28), కోలం వెంకటశేషయ్య (32), కూని వెంకటేశ్వర (21)లుగా గుర్తించారు. ఆర్ఎస్ఐ టి.రాఘవేంద్ర టీమ్ కడప జిల్లా ముత్తుకూరు ఫారెస్ట్ బీట్ పరిధిలో పాతూరు కుంట సమీపంలో కొంతమంది వ్యక్తులు మోటారు సైకిళ్లను పెట్టకుని అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని ప్రశ్నించే సరికి పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని చుట్టుముట్టి పట్టుకోగా, వారి సమీపంలో దాచి ఉంచిన ఎర్రచందనం డంప్ ను కనుగొన్నారు. అక్కడ 12ఎర్రచందనం దుంగలు లభించాయి. వీరిని అట్లూరు మండలానికి చెందిన అన్నపు నరసింహులు(39), డబ్బుగొడ్డు లక్ష్మీ నరసయ్య (47), గొర్ల రాము (45)లుగా గుర్తించారు. వీరి నుంచి రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేశారు. 23 ఎర్రచందనం దుంగలు 299కిలోలు ఉండగా, వాటి ధర దాదాపు రూ.30లక్షలు ఉండవచ్చునని తెలిపారు. రెండు కేసులను సీఐలు చంద్రశేఖర్, బాలకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

# పదవికి వన్నె తెచ్చే విధంగా కృషి చేస్తా

### రీజినల్ చేనేత విభాగం అధ్యక్షులు భువనేశ్వరి సత్య



మదనపల్లె, మార్చి 7, మనం న్యూస్ ప్రతినిధి : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన పదవికి వన్నె తెచ్చే విధంగా పని చేస్తానని ఆ పార్టీ రీజినల్ చేనేత విభాగం అధ్యక్షులుగా నియమితులైన నీరుగట్టువారి పల్లికి చెందిన భువనేశ్వరి సత్య అన్నారు. మంగళవారం రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం నుండి భువనేశ్వరి సత్యను చిత్తూరు,అన్నమయ్య, సత్య సాయి, అనంతపురం జిల్లాల వైఎస్ఆర్సిపి చేనేత విభాగం రీజినల్ అధ్యక్షులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుండి సత్య ఆ పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. టిడిపి కంచుకోటగా పట్టు ఉన్న నీరుగట్టువారిపల్లిలో వైసిపి బలోపేతానికి ఎంతో కృషి చేశారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర సందర్భంగా సిటిఎం సమీపంలో జరిగిన చేనేత సదస్సుకు వేలాదిమంది చేనేత కార్మికులు, వ్యాపారులను తీసుకెళ్లి విజయవంతం చేశారు. గత మున్సిపల్ ఎన్నికల్లో నీరుగట్టు వారిపల్లిలోని మూడు వార్డుల్లో వైసిపి అభ్యర్థులను కౌన్సిలర్ లుగా గెలిపించుకొని సత్తా చాటారు. సత్య సేవలను గుర్తించి నాలుగు జిల్లాల పరిధిలోని రీజినల్ వైయస్సార్ విభాగం చేనేత సంఘం అధ్యక్షుడిగా నియమించారు.ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ తనకు పదవి రావడంలో కీలకంగా వ్యవహరించిన రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణం, భూగర్భ, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, మదనపల్లి ఎమ్మెల్యే ఎం నవాజ్ భాషలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత మూడున్నరేళ్ళ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో చేనేతలకు అన్ని విధాలుగా న్యాయం జరిగిందన్నారు.

## కంచర్ల శ్రీకాంత్ కే ఎమ్మెల్సీ పట్టం కట్టండి

### గాలి మురళి నాయుడు



తొట్టంబేడు, మార్చి 7, మనం న్యూస్: శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జ్ బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు తొట్టంబేడు మండలంలోని కాసరం, చియ్యవరం పంచాయతీలలో పట్టభద్రులను కలసి మార్చి13వ తేదీన జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కంచర్ల శ్రీకాంత్ ని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని,ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ మొదటి ప్రాధాన్యతా ఓటును కంచర్ల శ్రీకాంత్ గారికి వేసి గెలిపించవలసిందిగా ఓటర్లను అభ్యర్థిస్తూ కరపత్రాలను అందజేస్తున్న మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు,మాజీ మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్ నాయుడు, మాజీ ఎంపీటీసీ రామయ్య, తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి రాఘవులు,తిరుపతి పార్లమెంట్ ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి మెరిమి వెంకటసుబ్బయ్య, తొన్నాటి సుబ్రహ్మణ్యం, గోపాల్,చంగల్రాయులు, పరశురాం,బాలగున్నయ్య, మణి, వెంకటయ్య,శైలజ్ కుమార్,దివ్య, దినేష్, బాలు,చంద్రప్ప నాయుడు,కృష్ణయ్య,మాధవయ్య, చిన్న పెంచలయ్య, అర్జునయ్య, శివ,వేమాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## టి.డి.పి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం





రామకుప్పం, మార్చి 7, మనం న్యూస్ : రాయలసీమ టి. డి. పి పట్టభద్రుల అభ్యర్థి కంచెర్ల శ్రీకాంత్ గెలుపుకోసం మంగళవారం మండల టి. డి. పి నేతలు ప్రచారం కొనసాగించారు ఈ ఎన్నికల్లో టి. డి. పి అభ్యర్థి మొదటి(1)ప్రాదాన్యత ఓటు వేసి అఖండ మెజార్టీ తో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు ఈ కార్యక్రమంలో మండల టి. డి. పి అధ్యక్షుడు ఏ. ఆనందరెడ్డి మాజీ అధ్యక్షుడు సి. ఆంజనేయరెడ్డి నేతలు నరసింహులు టి. వీ రవి బి. ఎస్ సలాం మంజునాథ్ ఏ. జి గంటలరెడ్డి మోహన్ సుబ్రహ్మణ్యం బాలు తదితరులు పాల్గొన్నారు

## టిడిపి ఎమ్మెస్ అభ్యర్థిని గెలిపించండి

### ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు



బంగారు పాలు, మార్చి 7, మనం న్యూస్.. 13వ తేదీ జరుగు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కల్చర్ల శ్రీకాంత్ గెలిపించాలని బంగారుపాలి మండలంలోని మొగిలి గ్రామ పంచాయతీ పరిధిలో తెలుగుదేశం పార్టీ పార్లమెంటు సభ్యులు కోకో ప్రకాష్ నాయుడు. చిత్తూరు జిల్లా ఆర్నేజర్ సెక్రెటరీ కోకో ప్రకాష్ నాయుడు. మాజీ సింగల్ విండో అధ్యక్షులు హేమ చంద్ర నాయుడు. మండల అధికార ప్రతినిధి మంజునాథ్. కోదండ నాయుడు. జనార్దన్ నాయుడు. ధనుంజయ నాయుడు.పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామ పంచాయతీ పరిధిలో ప్రకాశం. నెల్లూరు. చిత్తూరు. జరుగు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున గెలిపించి విధంగా చూడాలని తెలిపారు. అనంతరం మంగళవారం తెలుగుదేశం కార్యకర్తలు ఇంటింటికి తిరిగి వాటర్లను ఆకట్టుకున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిని కంచర్ల శ్రీకాంత్ గెలిపించి చంద్రబాబునాయుడుకు కానుక ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాలెం మండలంలోని మొగిలి గ్రామపంచాయతీలో టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీ కంచర్ల శ్రీకాంత్ గారిని గెలిపించాలని పట్టబద్రుల ఓటర్ల ఇంటి వద్దకు వెళ్లిమీ ఎన్నికల ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంచుతున్న చిత్తూరు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోక ప్రకాష్ నాయుడు, జుః సింగల్ విండో చైర్మన్ దీ. హేమచంద్ర నాయుడు, మండల అధికార హిళలు పాల్గొనడం జరిగింది

## టీడీపీని గద్దెనెక్కించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు

### రాష్ట్ర టిడిపి మైనార్టీ నాయకురాలు పర్వీన్ తాజ్



మదనపల్లి, మార్చి 7, మనం న్యూస్ ప్రతినిధి : టీడీపీని గద్దెనెక్కించేం దుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని, రాబోయే ఎన్నికలలో చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిగా చూడటానికి ప్రజలు ఆత్రుత కనబరుస్తున్నారని రాష్ట్ర టిడిపి మైనార్టీ నాయకురాలు పర్వీన్ తాజ్ అన్నారు. నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్ర గురించి ఆమె మాట్లాడుతూ రోజురోజుకు లోకేష్ చేపడుతున్న పాదయాత్రకు విశేష స్పందన లభిస్తోందన్నారు. మంగళవారం పీలేరు నియోజకవర్గంలో కొనసాగుతున్న లోకేష్ పాదయాత్రలో పర్వీన్ తాజ్ పాల్గొన్నారు. 500 కిలోమీటర్లు వరకు కొనసాగిన ఈ పాదయాత్రకు ప్రజల నుండి అనూహ్య స్పందన వస్తోందన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా రాష్ట్ర ప్రజలు మళ్లీ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడును గద్దెనెక్కించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పాదయాత్రలో వీరివెంట నూర్ అహ్మద్, నానబాల ప్రసాద్, ప్రభాకర్, శ్రీనివాసులు, సూరి తదితరులు పాల్గొన్నారు.

## హై కోర్టు స్టే ఉన్నా ఆగని పనులు



రామకుప్పం, మార్చి 7, మనం న్యూస్ : రామకుప్పం మండలం రాజుపేట గ్రామ పంచాయితీ ఎన్. టి. ఆర్ కాలనీ సమీపంలోని భూములకు హై కోర్టు స్టే ఉన్న భూముల్లో కొందరు నాయకుల అధికార్లు అండదండలతో అక్రమంగా ఇళ్ళు నిర్మాణ పనులు చేస్తున్నారని మంగళవారం బాధితుడు తెలియజేశారు హై కోర్టు స్టే వచ్చాక రెవెన్యూ అధికార్లు సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. పర్మినెంట్ ఇంజక్షన్ ఉన్న డీకే డి భూముల్లో అనధికార లేఔట్ వేసి పునాదులు వేస్తున్నారన్నారు గతంలో ఉన్న రెవెన్యూ పోలీసు డి. కె. టి భూముల్లో అనధికారంగా ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని సూచిక బోర్డు కూడా ఏర్పాటు చేసినా ఇటీవల కొందరు వ్యక్తులు అధికార్లు రాజకీయ నాయకుల అండదండలతో చట్టాన్ని ఉల్లంగించి పునాదులు తీస్తున్నారని తెలియజేశారు రెవెన్యూ అధికారులు తెలిసిన పట్టించుకోవడం లేదన్నారు రెవెన్యూ అధికార్లు కళ్ళు తెరిచి రికార్ధులను పరిశీలించి న్యాయాన్ని కాపాడాలని బాధితుడు తెలియజేశారు.

## వైఎస్సార్సీపీ సేవాదళ్ జోనల్ ఇన్‌ఛార్జిగా తలుపుల డీకే బాబు



కదిరి మార్చి 07 మనం న్యూస్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చిత్తూరు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా, అన్నమయ్య జిల్లాల వైఎస్సార్సీపీ సేవాదళ్ జోనల్ ఇంఛార్జిగా ఇ. కృష్ణా రెడ్డి (డీకే బాబు) నియమితులయ్యారు.ఈ సందర్భంలో డీకే బాబు మాట్లాడుతూ నన్ను నమ్మి నాకు ఇంతటి బాధ్యతలు ఇచ్చినటువంటి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి, సజ్జల రామకృష్ణారెడ్డి కి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కి, విజయసాయి రెడ్డి కి, ఎమ్మెల్యే పి వి సిద్ధారెడ్డి కి, ఎమ్మెల్సీ కల్పలత రెడ్డి కి ,తన ఎంపికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

## మాజీ మంత్రి గల్లా అరుణకుమారి ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ సంబరాలు



చిత్తూరు, మార్చి 7, మనం న్యూస్ : చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం దిగువమాగం గ్రామంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివిధ రంగాల్లో మహిళా అభ్యున్నతికి విశేషమైన సేవలందిస్తున్న మహిళలు మరియు దిగువమాగం , కొండ్రజుకాలువ , అరగొండ మరియు సమీప గ్రామంలో గల మహిళలు పాల్గొని మహిళా దినోత్సవం సందర్భంగా సంబరాలు చేసుకున్నారు. అనంతరం మహిళలందరూ కలిసి మహిళా అభ్యున్నతికి విశేష సేవలు అందించిన మాజీ మంత్రి గల్లా అరుణ కుమారిని ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో అమర హాస్పిటల్ అధినేత్రి గౌరనేని రమాదేవి , దుర్గా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గరుడ వాహనంపై కళ్యాణ వెంకన్న



చంద్రగిరి, మార్చి 7, మనం న్యూస్ : శ్రీనివాస మంగాపురం లోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా గరుడ వాహనంపై శ్రీ కళ్యాణ వెంకన్న ఊరేగారు. సాయంకాలం 6 గంటలకు ఆలయ మాడవీధుల్లో శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏ ఈ ఓ, గురుమూర్తి, సూపరింటెండెంట్ టి. వెంకటస్వామి, టెంపుల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ , అర్చకులు ఏ వై ఎల్ శ్రీనివాసా చార్యులు స్వామి, డి. వి. మురళీకృష్ణమా చార్యులు, భాస్కర్ స్వామి, రాజశేఖర్ స్వామి, రవిచంద్రన్ స్వామి, ఉదయ్ తేజ స్వామి, తిరువెంగడం స్వామి, ఓ ఎస్ డబ్లు. మూర్తీ మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అంధ విద్యార్థులు



తిరుమల, మార్చి 7, మనం న్యూస్: తిరుమల శ్రీవారిని మంగళవారందాదాపు 400 మంది అంధ విద్యార్థులు, ప్రత్యేక ప్రతిభావంతులు దర్శించుకున్నారు. హైదరాబాద్ కు చెందిన అష్టోత్తర శత చుక్కల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వీరు మంగళవారం తిరుమలకు చేరుకున్నరు. వీరికి టిటిడి అధికారులు స్వామి వారి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వారు పొందిన దివ్యానుభూతికి ఆనందం వ్యక్తం చేశారు. దర్శన ఏర్పాట్లు చేసిన టిటిడి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు వేణు, ఇతర టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

## ఉత్తమ సీడీపీవోగా ఫర్జానా

తొట్టంబేడు, మార్చి 7, మనం న్యూస్: తొట్టంబేడు స్త్రీ,శిశు సంక్షేమశాఖ అధికారిణి ఫర్జానాకు ఉత్తమ సీడీపీవో అవార్డు అందజేశారు. తిరుపతి కలెక్టరేట్ లో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా తొట్టంబేడు సీడీపీవో ఫర్జానాకు కలెక్టరు వెంకట్రమణారెడ్డి ఉత్తమ సీడీపీవో అవార్డును ప్రదానం చేశారు.ఫర్జానా ఐసీడీఎస్ లో చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు అందచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఆమెకు ఉత్తమ సీడీపీవో అవార్డు రావడం పట్ల పలువురు అధికారులు, మండల నాయకులు ఆమెను అభినందించి శుభాకాంక్షలు తెలియచేశారు.

## రాజకీయా కక్ష్యలతో రెండు ద్విచక్రవాహనాలు దగ్ధం

రామకుప్పం, మార్చి 7, మనం న్యూస్ : రామకుప్పం మండలం పి. ఎం. కె తాండాగ్రామంలో మంగళవారం వై. ఎస్సార్పి. పార్టీకి చెంది న రెండు ద్విచక్రవాహనాలు దగ్ధం అయినట్లు ఆ పార్టీ నాయకులు తెలియజేశారు పులిమదుడుగు కొత్తూరు తాండ గ్రామపంచాయితీ వై. ఎస్సార్ పార్టీ అధ్యక్షుడు ఎం. బంగారునాయక్ కుమారులు ఎం. రమేష్ నాయక్ ఎం. సాయి నాయక్ రెండు ద్విచక్రవాహనాలను సోమావారం రాత్రి తమ ఇంటి ముందు భాగంలో పార్కింగ్ చేసి నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియ వ్యక్తులు రెండు ద్విచక్రవాహనాలకు నిప్పు పెట్టి దగ్ధం అయినట్లు బాధితులు తెలియజేశారు రాజ కీయకక్ష్యతో జరిగిందా గ్రామంలో మరొకవిదంగా జరిగిందా పోలీసులు విచారణలో తేలాస్సి ఉంది.

# నిబద్ధత కలిగిన ఎమ్మెల్సీలను గెలిపిద్దాం




తిరుపతి, మార్చి 7, మనం న్యూస్: జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో సమస్యలు పరిష్కరించడంలో నిబద్ధతతో తమదైన శైలిలో స్పందించే ఇద్దరు ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి అని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి అన్నారు.ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు పట్టణంలోని వి.పి.ఆర్ కన్వెన్షన్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది.ఈ సమావేశంలో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పాల్గొని మాట్లాడుతూ దేశంలోనే బడుగు బలహీనవర్గాల ఉన్నతి కోసం పాటుపడుతూ వారికి రాజ్యాధికారం అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అని అన్నారు. పద్దెనిమిది ఎమ్మెల్సీ స్థానాలలో అగ్రభాగం బడుగు బలహీన వర్గాలకు కేటాయించిన ఘనత కూడా మా నాయకుడు జగన్మోహనరెడ్డిదే అన్నారు.ఆలాగే నేడు ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్ ఇద్దరు అభ్యర్థులు కూడా సేవ చేయడంలో ఒకరిని మించిన వారు మరొకరని అలాంటి వారు చట్ట సభలకు ఎన్నికయితే మరింత మందికి సేవ చేసే అవకాశం ఉంటుందని వారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మంచి మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ కల్పనలో విప్లవాత్మక మార్పులు తెచ్చి ఓ పక్క గ్రామ స్వరాజ్యం మరోపక్క నిరుద్యోగ యువతకి ఉద్యోగ కల్పనే లక్ష్యంగా సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షల ఉద్యోగాలు కల్పించిన మన ప్రభుత్వానికి మన ప్రియతమ నేత జగనన్నకి అండగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఇటీవల వైజాగ్లో జరిగినటువంటి గ్లోబల్ ఇన్వెస్ట్ ఇండియా సమ్మిట్లో చాలా కంపెనీలు తిరుపతి పార్లమెంట్ పరిధిలో పెట్టుబడులు పెట్టేందుకు సుముఖత చూపాయని వాటిలో జిందాల్ స్టీల్స్, మరికొన్ని ఐటీ, నాన్ ఐటీ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం చేసుకొన్నాయాని ఆలాగే ఇది వరకే పెట్టుబడి పెట్టేందుకు అన్ని రకాల అనుమతులు పొంది పనులు మొదలు పెట్టేందుకు సిద్ధంగా ఉన్న క్రిబ్కో కంపెనీ కాని ఇవన్నీ పూర్తయితే పట్టభద్రులు అందరికీ అపారమైన ఉద్యోగ అవకాశాలు వస్తాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి జిల్లా పార్టీ అధ్యక్షుడు ఎన్. రాంకుమార్ రెడ్డి, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు వి.ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏపీ ఎస్పీడీసీఎల్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు




తిరుపతి, మార్చి 7, మనం న్యూస్ : ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఎస్పీడీసీఎల్) లో మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం ఏపీ ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్) వీ. ఎన్. బాబు, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) కే. శివప్రసాద రెడ్డి లు మాట్లాడుతూ దేశ అభ్యున్నతికి మహిళా శక్తి కీలకమని తెలిపారు. మహిళలు ఎంతో సహనం, ఓర్పుతో ఒకవైపు ఇంటి బాధ్యతలను చూసుకుంటూ, మరోవైపు కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తూ సమాజ అభివృద్ధికి తమ వంతు తోడ్పాటును అందిస్తున్నారని కొనియాడారు. మహిళలు అన్ని రంగాల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్ ఆర్ డి) డి.ఎస్.వరకుమార్, జాయింట్ సెక్రటరీ ఏ. రాధాజయశ్రీ, జనరల్ మేనేజర్లు పద్మ, శారద, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వాసవిలత, పర్సనల్ ఆఫీసర్ సుబ్బలక్ష్మి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు లక్ష్మి, స్వాతి, ఇతర మహిళా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా కోదండరామ స్వామి రథోత్సవం



శాంతిపురం, మార్చి 7, మనం న్యూస్: శాంతిపురం మండలం లోని రాళ్ళబూదుగూరులో వెలిసిన శ్రీ కోదండరామస్వాముల వారి బ్రహ్మోత్సవములలో భాగంగా 7 వ రోజు అంగరంగ వైభవంగా రాతి చక్రాల రథోత్సవం పై శ్రీ కోదండరామ స్వామి విశేష అలంకారంతో రాళ్ళబూదుగూరు గ్రామ పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలలో రథోత్సవం లో భాగంగా రాళ్లబూదుగూరు వంశ పారంపర్య ధర్మకర్తలు కే జే ప్రశాంత్ నాయుని వారిచే మరియు రెడ్డి సంఘం (జేఏసీ) వారి తరపున వేల వేల సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు, కార్యక్రమంలో భాగంగా కేరళ వాయిద్యాలు మరియు డప్పు వాయిద్యాల విశేషంగా ఆకర్షించింది. రథోత్సవం విచ్చేసిన భక్తులకు రాళ్ళబూదుగూరు హెల్పింగ్ హాండ్స్ వారి తరపున వైద్య సేవలు అందించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాలుగు మండలాల పోలీసు సిబ్బంది వారిచే బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది ఇందులో నాలుగు మండలాల ఎస్సలు మరియు ప్రజా ప్రతినిధులు నాయకులు వేలాదిమంది భక్తజనం పాల్గొన్నారు.

# ఓటర్లూ.. మీరు చిక్కుల్లో పడతారు

- ఎమ్మెల్సీ దొంగ ఓట్లపై న్యాయస్థానం కెళతాం
- టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు

తిరుపతి, మార్చి 7, మనం న్యూస్: జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో దొంగ ఓట్లను సృష్టించారని ఓటర్లు మీరు జాగ్రత్తగా ఉండాలని లేనిచో చిక్కుల్లో పడతారని ఓటర్లను టిడిపి పాలకొల్లు ఎమ్మెల్యే నిర్మల రామానాయుడు హెచ్చరించారు. మంగళవారం స్థానిక కపిల్ తీర్థం వద్దనున్న టిడిపి పార్టీ కార్యాలయంలో తిరుపతి ఇన్ఛార్జి మన్నూరు సుగుణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సుగుణమ్మ, రామానాయుడు మాట్లాడుతూ జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో పోలింగ్ బూత్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఉంటారని ఓటర్లు జాగ్రత్తగా వివరించాలని దొంగ ఓట్లు వేసుకునేవారు చిక్కుల్లో పడతారని హెచ్చరిస్తూ ఓటర్లు నిజాయితీగా వ్యవహరించాలని అన్నారు. తిరుపతి నెల్లూరు ఎమ్మెల్సీ ఓటర్లుగా ఫేక్ ఐడీలను సృష్టిస్తూ పేరు అడ్రస్సు నువ్వు మార్చి ఫోన్ నెంబర్లు మార్చి ఒక్కొక్క ఇంటిలో పదిమంది 13 మంది 23 మంది అసలు ఇల్లే లేని చోట డోర్ నెంబర్తో ఐదు వాటర్ లో ఉన్నట్టుగా వైసిపి నాయకులు సృష్టించారని దీనిపై అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టుకు వెళతామని. ఓటర్లకు మరోసారి హెచ్చరిస్తున్నామని తెలిపారు. బుల్లెట్ రమ ణ, పులిగోరు మురళి , సీనియర్ నాయకులు సూరా సుధాకర్ రెడ్డి, వూకా విజయ్ కుమార్, శ్రీధర్ వర్మ, చింతమాకుల జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు



## పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుకై వైకాపా నాయకుల ప్రచారం



ఓబుల దేవర చెరువు మార్చి 7 మనం న్యూస్: వైకాపా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నుపూసల రవీందర్ రెడ్డి నీ గెలిపించాలంటూ మంగళవారం ఓబుల దేవర చెరువు మండల వైకాపా నాయకులు ప్రచారం నిర్వహించారు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నుపూసల రవీందర్ రెడ్డి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో బరిలో నిలిచారన్నారు. ఈ సందర్భంగా వారు జీవన్ జ్యోతి స్కూల్. వశిష్ట స్కూల్. మస్తాన్ స్కూల్ . విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, ల లో పట్టభద్రులు కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నుపూసల రవీందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి గెలిపించాలని వారు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు శ్రీమతి తుమ్మల పర్వీన్ భాను . కన్వీనర్ రాజు నాయుడు. రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షామీర్ భాష. అగ్రి అడ్వైజరి చైర్మన్ లక్ష్మిరెడ్డి. స్థానిక సర్పంచ్ గోవిందు .వైఎస్ఆర్సిపి నాయకులు ఆనంద్ రెడ్డి .గొల్లపల్లి వెంకటరెడ్డి .మహేశ్వర్ రెడ్డి. జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల బాబా .సూర్యనారాయణ రెడ్డి .డీలర్లు సూరి .ఫిరోజ్. జానీ భాష . వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి



బ్రహ్మసముద్రం మార్చి 07 మనం న్యూస్ బ్రహ్మసముద్రం మండల పరిధిలోని గౌంచిరెడ్డిపల్లి పిల్లలపల్లి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంను నిర్వహించిన మంత్రి ఉషాశ్రీచరణ్ జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలలో రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ వై.యస్.జగన్మోహన్ రెడ్డి గారి ఆశీస్సులతో పోటీచేయుచున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ వై ఎస్ ఆర్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గారికి మరియు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి యం.వి. రామచంద్రారెడ్డి గారికి మీ అమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి అఖండమైన మెజారిటీతో గెలిపించాలని కోరుతూ నేడు బ్రహ్మసముద్రం మండల పరిధిలోని పిల్లలపల్లి,గౌంచిరెడ్డి పల్లి గ్రామాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంను నిర్వహించి ఓటును అభ్యర్థించిన రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు శ్రీమతి కే.వి.ఉషాశ్రీచరణ్ మాట్లాడుతూ ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి, జెడ్పిటిసి ప్రభావతి, మండల కన్వీనర్ బసవరాజ్, సింగల్ విండో అధ్యక్షుడు రామాంజనేయులు, అశోక్ రెడ్డి, లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాద్ రెడ్డి, గోపాల్, ఏరు స్వామి, వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఎంపీటీసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల విస్తృత ప్రచారం



డి. హీరెహాల్ మనం న్యూస్ ప్రస్తుతం జరుగబోతున్న ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా డి. హీరెహాల్ మండల పరిధిలోని మురడి గ్రామం లో ఎంపిటిసి గంగాధర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ని అత్యధిక మెజారిటితో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఇందులో భాగంగా మంగళవారం నాడు మురడి గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల ఇంటింటికి వెళ్లి రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగ ఉపాధ్యాయుల సమస్యలపై తెలుగుదేశం పార్టీ తరపున గళాన్ని వినిపించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డ రాంగోపాల్ రెడ్డి కి ఈనెల 13వ తేదీ నిర్వహించేటటువంటి ఎమ్మెల్సీ ఎన్నికలలో మీయొక్క అమూల్యమైన ఓటును వేసి గెలిపించాల్సిందిగా ఓటర్లను ఎంపీటీసీ గంగాధర కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకట్ రెడ్డి నాగరాజు, పరంధామ, రామాంజినేయులు, సంజీవప్ప చన్నవీర,తదితరులు పాల్గొన్నారు.

## నేంద్రగుంట చెరువులో తల్లీ బిడ్డ మృతదేహాలు



పాకాల, మార్చి 7, మనం న్యూస్: తిరుపతి జిల్లా పాకాల మెయిన్ రోడ్డు నేశేంద్ర గుంట వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రక్కన ఉన్న చెరువులో మహిళ తన బిడ్డ మృతదేహాలు కనపడటంతో చుట్టుపక్కల స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు పోలీసులు శవాన్ని బయటకు తీసి చూడగా తల్లి తన బిడ్డను చున్నీతో తన కడుపుకు కట్టుకొని ఉండటం గుర్తించారు కేసు పై విచారణ జరపగా మృతురాలు పేరు మహేశ్వరి వయస్సు 30సంవత్సరాలుగా మహేశ్వరి బిడ్డ మగ బిడ్డగా గుర్తించారు మృతురాలి భర్త పేరు నాగేంద్ర గా గుర్తించిన పోలీసులు నాగేంద్రకు ఫోన్ చేయగా అనంతపురం జిల్లా వెలుగప్ప మండలం జీడిపల్లి గ్రామంగా భర్త నాగేంద్ర తెలియజేశాడు పాకాల ఎమ్మార్వో భాగ్యలక్ష్మి మృతదేహాన్ని పరిశీలించారు. తిరుపతి డీఎస్పీ నరసప్ప సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకుందా లేదా వేరే కారణాలు ఏవైనా ఉన్నాయని అనే అంశంపై విచారిస్తామని తెలిపారు సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భద్రాద్రి రామయ్య సన్నిధిలో ఘనంగా వసంతోత్సవ వేడుకలు



భద్రాచలం, మార్చి 7 (మనం న్యూస్) : ఈ నెల 30 న జరగనున్న సీతారాముల కళ్యానానికి  పాల్గుణ పౌర్ణమి సందర్భంగా ఈ



రోజు నుంచి పనులు ప్రారంభించిన ఆలయ అధికారులు. రోలు రోకలికి పూజలు చేసి ముత్తైదువులతో పసుపు కొమ్ములు దంచి పసుపు తయారు చేసి కళ్యాణ తలంబ్రాలు కలిపిన మహిళలు. అనంతరం డొలోత్సవం, వసంతోత్సవం వేడుకలు. తలంబ్రాలుకలపడానికి అధిక సంఖ్యలోఆలయం వద్దకు కదిలి వచ్చిన మహిళలు. ఈ కార్యక్ర మంలో దేవస్థానంఅర్చకులు,ఆలయసిబ్బంది, పట్టణ ప్రముఖులు హాజరైనారు.

## భూ అక్రమాలకు నాకు ఎటువంటి సంబంధం లేదు..

**- 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయాల్లో ఎటువంటి అన్యాయాలకు అక్రమాలకు పాల్పడలేదు..**

**- మావోయిస్టు పార్టీ నాయకులు నామీద విమర్శ చేయడంలో పునరాలోచించాలి..**

**- తెలుగుదేశం పార్టీ ప్రారంభం నుంచి ప్రజల కోసమే నిస్వార్థంగా సేవ చేశాను..- కొడాలి శ్రీనివాసన్**



భద్రాచలం, మార్చి 7 (మనం న్యూస్) : భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు నాయకులు నా మీద చేస్తున్న ఆరోపణలు ఖండిస్తున్నాను భద్రాచలం పట్టణంలో ఐటీడీఏ రోడ్లో ఉన్న చెరువు అక్రమాలకు కొడాలి శ్రీనివాసన్ పాత్ర ఉందని మావోయిస్టు పార్టీ నాయకులు ఆరోపించడం సరైన పద్ధతి కాదని మావోయిస్టులు మరోసారి పునరాలోచించుకోవాలని కొనాలి శ్రీనివాస్ అన్నారు. తెలు గుదేశం పార్టీ ప్రారంభించి అంచెలంచెలుగా పార్టీ కోసం ఏజెన్సీలోని పేద ప్రజల సమస్యల పరిష్కారం కొరకు నిస్వార్థంగా సేవ చేశానని 45 ఏళ్ల తెలుగుదేశం పార్టీ రాజకీయాల్లో ఏనాడు కూడా అన్యాయాలకు అక్రమాలకు పాల్పడలేదని ,పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండా పార్టీ కార్యక్రమాలతో పాటు న్యాయవాదిగా జీవనం సాగిస్తూ అనేకమంది పేద ప్రజలకు న్యాయ సహాయం ఉచితంగా చేశారని నా మీద ఇటువంటి ఆరోపణలు చేయటం బాధ కలిగించాయని  కొడాలి శ్రీనివాసన్ అన్నారు.. అక్రమాలను ఎప్పుడు ప్రోత్సాహం కూడా చేయలేదని ఇటువంటి ఆరోపణలపై విచారణకు సిద్ధంగా ఉన్నానని అన్నారు.

## పోలీసు కమిషనరేట్‌లో ఘనంగా హోలీ వేడుకలు



కరీంనగర్ బ్యూరో, మార్చి 7 (మనం న్యూస్: కరీంనగర్ పోలీస్ కమిషనర్ కేంద్రంలో మంగళవారం హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. అన్ని స్థాయిలకు చెందిన పోలీసులు కుటుంబ సభ్యులుగా కలసి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. బ్యాండ్ మేళాలు, నృత్యాల మధ్య ఆనందాలను పంచుకుంటూ రంగుల్లో మునిగి తేలారు. అన్ని స్థాయిలకు చెందిన పోలీసులు ఒక బృందంగా బయలుదేరి పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడు ను కలిసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడు అన్ని స్థాయిల కు చెందిన పోలీసులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం సిపి ఆధ్వర్యంలో పోలీసులు కమిషనర్ క్యాంపస్ నుండి మొదలుకొని డిఐజి కార్యాలయం వరకు నృత్యాల మధ్య వెళ్ళి డిఐజి కె.రమేష్ నాయుడుకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సిపి సుబ్బారాయుడు, డిఐజి రమేష్ నాయుడుల ఆధ్వర్యంలో పోలీసులు కలెక్టర్ క్యాంపు కార్యాలయం వరకు బ్యాండ్ మేళాలతో నృత్యాలు చేస్తూ వెళ్లి కలెక్టర్ కర్ణన్ దంపతులకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిఎస్.శ్రీనివాస్,ఏసిపిలుతుల శ్రీనివాసరావు,కరుణాకర్ రావు, జె.విజయసారధి, సి.ప్రతాప్, ఎస్బిఐ జి.వెంకటేశ్వర్లు, ఇన్స్పెక్టర్లు సిహెచ్ నటేష్, లక్ష్మీ బాబు, దామోదర్ రెడ్డి, విజ్ఞాన్ రావు, తిరుమల్, నాగార్జున రావు, ఆర్ఐలు సురేష్, మురళి, మల్లేశం, శేఖర్‌బాబులతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**వికలాంగులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న పోలీస్ కమిషనర్**

హోలీ వేడుకల సందర్భంగా పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడు తనకు ఎదురైన వికలాంగులను కలిసి హోలీ శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటుగా వారికి స్వీట్లు పంపిణీ చేశారు.



# కలెక్టర్ల హోలీ సంబురాలు

వరంగల్, మార్చి 7, మనం న్యూస్ : హోలీ పండుగ సదర్భంగా హనుమకొండ కలెక్టర్ సిక్త పట్నాయక్ కుటుంబ సభ్యులతో హోలీ సంబరాల్లో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ బి గోపి దంపతులు పాల్గొన్నారు. ఈ హోలీ వేడుకల్లో ఇరు కలెక్టర్ల కుటుంబ సభ్యులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.







## భక్తి శ్రద్ధల మధ్య రాములోరికి.. వసంతోత్సవం.. డోలోత్సవం..



ఇల్లందకుంట, మార్చి 7 (మనం న్యూస్): అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం లో హోలీ పండుగ సందర్భంగా రాములోరికి డోలోత్సవం, వసంతోత్సవాలను  మంగళవారం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామ దేవాలయం నుండి ఊరేగింపుగా సన్నాయి మేళ తాళాల మధ్య ప్రధాన ఆలయానికి తీసుకువచ్చారు.  ఆలయ ప్రధాన అర్చకులు శేషం రామాచార్యులు, వంశీధరచార్యుల మంత్రోచ్ఛారణల మధ్య ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల సుధాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని స్వామి వారిపై భక్తులపై వసంతాన్ని చల్లి హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తదనంతరం భారీగా హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి తిరిగి స్వామివార్లను ప్రధాన దేవాలయం నుండి గ్రామ దేవాలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆలయంలో ఉమ్మడి లక్షణాచారి కళ బృందం ఆలకించిన భక్తి గీతాలు భక్తులను అలరించాయి.

## అందరినీ ఏకం చేసేదే హోలీ పర్వదినం

**మంత్రి గంగుల కమలాకర్**

**- హోలీ వేడుకల్లో ఆనందంగా స్టెప్పులు వేసిన మంత్రి**



కరీంనగర్ బ్యూరో, మార్చి 7 (మనం న్యూస్): కుల, మత, రాజకీయ విబేధాలు అనే తారతమ్యాలను దూరం చేసి అందరినీ ఏకం చేసేదే హోలీ పర్వదినమని రాష్ట్ర పౌరసరఫరాలు, బిసి సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో జరిగిన హోలీ వేడుకల్లో ఆయన ఆనందోత్సహాల మధ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి రంగులు చల్లుకుంటూ, డిజె పాటలకు స్టెప్పులు వేసి ఉత్సాహాన్ని నింపారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాలు కలిసి ఆనందంగా జరుపుకునే పర్వదినం హోలీ అన్నారు.ఎలాంటి తారతమ్యాలు లేకుండా అందరూ కలిసిమెలిసి ప్రశాంత వాతావరణంలో హోలి పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు.

## బండి సంజయ్ ఆధ్వర్యంలో ఘనంగా హోలీ సంబరాలు

కరీంనగర్, మార్చి 7 (మనం న్యూస్): బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కరీంనగర్ ఎంపి బండి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో హోలీ సంబరాలు జిల్లా కేంద్రంలోని కోర్టు చౌరస్తాలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బిజెపి, దాని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలతో కలిసి సంజయ్‌కుమార్ హోలీ సంబరాలు జరుపుకున్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాల మధ్య రంగుల పండుగను నిర్వహించుకున్నారు.



## ఘనంగా హోలీ సంబురాలు

**- సంబురాల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ**



మహబూబాబాద్, మార్చి 7 (మనం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లాలో హోలీ వేడుకలు మంగళవారంనాడు అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో జరిగిన హోలీ వేడుకలలో  జిల్లాకలెక్టర్ శశాంక, జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ లతోపాటు పలువురు అధికారులు పాల్గొని సందడి చేశారు. హోలీ వేడుకల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రజలు రంగుల పండుగ ఉత్సాహంతో జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు



చల్లుకుంటూ ఆనందంగా ఉత్సాహంగా గడిపారు.  జిల్లా కేంద్రంలో జరిగిన హోలీవేడుకల్లో కలెక్టర్ శశాంకతో పాటు ఎస్పీ శరత్ చంద్రపవార్, అడిషనల్ కలెక్టర్ అభిలాషఅభినవ్, డిఎఫ్ఓ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు. వారితోపాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని రంగులు చల్లుకుంటూ  నృత్యాలు చేశారు.

## సాగర్‌ను సందర్శించిన జిల్లా న్యాయమూర్తి



నాగార్జునసాగర్, మార్చి 7 (మనం న్యూస్) :  నాగార్జునసాగర్ ను మంగళవారం నాడు నల్గొండ జిల్లా న్యాయమూర్తి జగ్జీవన్ కుమార్ కుటుంబ సమేతంగా సందర్శించారు. విజయ్ విహార్ అతిథి గృహానికి చేరుకున్న వీరికి నిడమనూరు కోర్టు న్యాయమూర్తి స్వప్న, స్థానిక సీఐ నాగరాజు , ఎస్ఐ రాంబాబులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వీరు నాగార్జునకొండ మ్యూజియాన్ని, ప్రధాన డ్యామును ,ఎత్తిపోతల జలపాతాన్ని సందర్శించారు. అటు తరువాత బుద్ధవ నాని సందర్శించి బుద్ధుని పాదాలకు పుష్పాంజలి ఘటించారు . బుద్ధ చరిత వనం ,ధ్యానవనం ,జాతకవనం, స్థూప వనం ,మహాస్థూపాన్ని దాని అంతరభాగం లోని ధ్యాన మందిరాన్ని సందర్శించారు. వీరికి స్థానిక గైడు సత్యనారాయణ నాగార్జునకొండ, బుద్ధవనం చారిత్రక విశేషాలను వివరించారు. వీరితోపాటు కోర్టు సిబ్బంది అంజయ్య, లక్ష్మయ్య ,అబ్దుల్  ఖాళీక్ , శివ తదితరులు ఉన్నారు.

# కళ్యాణం.....కమనీయం

**- వైభవంగా వెంకటేశ్వరస్వామి కళ్యాణం**

**- భారీగా హాజరైన మహిళలు**

**- కళ్యాణ క్రతువును వివరించిన అర్చకులు**

**- శ్రద్ధగా ఆలకించిన భక్తులు**



కారేపల్లి, మార్చి 7 (మనం న్యూస్) : కారేపల్లిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం మంగళవారం కమనీయంగా, కన్నుల పండుగగా, వైభవంగా జరిగింది. హోలీ పండుగ రోజున ప్రతి సంవత్సరం జరిగే కళ్యాణ మహోత్సవంలో భాగంగా ఉదయం నుండి స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలొ కళ్యాణ అర్చకులు గుడుంబై రవికిరాణాచార్యులు, మురళికృష్ణ శర్మలు స్వామివారి కళ్యాణాన్ని నిర్వహించారు. తెర్దారుపల్లికి చెందిన పెండ్యాల లక్ష్మినారాయణ, నాగమణి, పెండ్యాల జగదీష్, కుసుమ, పెండ్యాల ఉదయ్‌బాస్కర్, రమారాజేశ్వరి, వెన్ను హనుమంతరావు, స్పందన, పోతునూక నాగేశ్వరరావు, రేవతి దంపతులు పీతలపై కూర్చొని కళ్యాణ క్రతువును నిర్వహించారు. కళ్యాణం నిర్వహిస్తున్న పూజారి రవికిరణాచార్యులు కళ్యాణ క్రతువుకు సంబంధించిన ఒక్కొక్క ఘట్టాన్ని వివరిస్తూ, వాటికి తగు ఉదాహరణలు చెపుతూ శాస్త్రోక్తంగా



భక్తులకు వివరించగా భక్తులు సైతం శ్రద్దగా ఆలకించి, స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని ఆసక్తిగా తిలకించారు. అనంతరం పెండ్యాల లక్ష్మినారాయణ కుటుంభ సభ్యులు ఆలయానికి అబివృద్ధికై లక్ష నూటపదహారు రూపాయల  చెక్కును డిపాజిట్ చేయడానికి విరాళంగా దేవాదాయ శాఖా అధికారులు నల్లమోతు శేషయ్య, పగడాల మోహన్ కృష్ణకు అందచేశారు.  అనంతరం అర్చకులు పీతలపై కూర్చున్న వారికి ఆశీర్వచనం, స్వామి వారి తలంబ్రాలు అందచేశారు.  కళ్యాణ మహోత్సవానికి దేవాదాయ శాకా సిబ్బంది నల్లమోతు శేషయ్య, పగడాల మోహన్ కృష్ణలు ఏర్పాట్లు చేశారు. కాగా బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్, టిపిసిసి మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల కళ్యాణాన్ని వీక్షించి స్వామివారికి పూజలు నిర్వహించారు.

# అహ్మదాబాద్ పిచ్ తీరేంటో..?

అహ్మదాబాద్: భారత్ – ఆస్ట్రేలియా జట్ల మధ్య నాలుగు టెస్టుల సిరీస్ ముగింపు దశకు చేరుకుంది. ప్రస్తుతం 2–1 ఆధిక్యంలో టీమ్ఇండియా ఉండగా.. చివరి మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా మార్చి 9 నుంచి ప్రారంభం కానుంది. ఈ క్రమంలో ఎలాంటి పిచ్‌ను తయారు చేస్తారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే తొలి మూడు టెస్టుల్లో స్పిన్ ట్రాక్ వాడేసిన విషయం తెలిసిందే. అయితే, రెండు టెస్టుల్లో గెలిచిన టీమ్ఇండియాకు మూడో మ్యాచ్‌లో మాత్రం చుక్కెదురైంది.

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ బెర్తు ఖరారు చేసుకుని.. నాలుగో టెస్టుకు ఫాస్ట్ బౌలింగ్ ట్రాక్‌ను సిద్ధం చేసుకోవాలని టీమ్ఇండియా తొలుత భావించింది. తీరా, ఇప్పుడు విజయం కీలకం కావడంతో స్పిన్ పిచ్‌ను సిద్ధం చేసేందుకే మొగ్గు చూపే అవకాశం ఉంది. అయితే, ఇప్పటి వరకు పిచ్ పరిస్థితి ఏంటనేది తెలియరాలేదు. కానీ, సోషల్ మీడియాలో మాత్రం పిచ్‌కు



సంబంధించిన ఫొటోలు దర్శనమిచ్చాయి. బీసీసీఐ నుంచి తమకెలాంటి సూచనలు రాలేదని గుజరాత్ క్రికెట్ అసోషియేషన్ క్యూరేటర్లు తెలిపారు. దీంతో అటు ఆసీస్, ఇటు భారత జట్టు శిబిరాలు సందిగ్ధంలో పడ్డాయి. ఈ పరిస్థితుల్లో టాస్ చాలా కీలకంగా మారే అవకాశం ఉంది. నాలుగో టెస్టుకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బానెస్ హాజరవవుతారు.

**క్రీజ్‌లో పాతుకుపోతే..**

గత గణాంకాలను పరిశీలిస్తే.. అహ్మదాబాద్ పిచ్ స్పిన్ బౌలింగ్‌కు పూర్తిగా అనుకూలంగా ఉంది. స్టేడియం పునర్నిర్మాణం తర్వాత ఇక్కడ రెండు టెస్టులు జరిగాయి. ఆ రెండూ ఇంగ్లాండ్‌తోనే కావడం విశేషం. సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌తో కలిసి లోకల్ బాయ్ అక్షర్ పటేల్ ఇంగ్లాండ్‌ను శాసించాడు. మొత్తం 40 వికెట్లలో 35 వికెట్లను వీరిద్దరే పడగొట్టారు. అలాగే ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ జో రూట్ కూడా పార్ట్ టైమ్ స్పిన్ బౌలింగ్‌తో ఐదు వికెట్ల (5/8) ప్రదర్శన చేయడం గమనార్హం. ఇటీవల రంజీ మ్యాచ్‌లో రైల్వేస్ జట్టు ఏకంగా 508 పరుగులు సాధించింది. కానీ, గుజరాత్ మాత్రం రెండు ఇన్నింగ్స్‌లలోనూ 200+ పరుగులు సాధించి ఇన్నింగ్స్ తేడాతో ఓటమిపాలైంది. కాబట్టి, బ్యాటర్ క్రీజ్‌లో పాతుకుపోతే మాత్రం పరుగులు సాధించడం పెద్ద కష్టం కాదని క్రికెట్ పండితులు అంచనా వేస్తున్నారు.

## అలా జరిగితే భారత్ ఇంటికే..



న్యూఢిల్లీ: బోర్డర్–గావస్కర్ ట్రోఫీలో మొదటి రెండు టెస్టుల్లో ఘన విజయం సాధించిన టీమ్ఇండియాకు మూడో టెస్టులో కంగారులు గట్టి షాకిచ్చారు. అనుహ్యమైన ఆటతీరుతో మూడో టెస్టులో గెలిచిన ఆస్ట్రేలియా డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది. అయితే, మిగిలిన మరో ఫైనల్ బెర్తు కోసం భారత్, శ్రీలంక పోటీపడుతున్నాయి. 2021–2023 డబ్ల్యూటీసీ చక్రంలో భారత్ ఇంకో మ్యాచ్ (ఆసీస్తో నాలుగో టెస్టు) ఆడనుంది. న్యూజిలాండ్‌తో శ్రీలంక రెండు టెస్టుల్లో తలపడనుంది. ఆస్ట్రేలియాతో జరిగే నాలుగో టెస్టులో భారత్ విజయం సాధిస్తే.. శ్రీలంక, న్యూజిలాండ్ టెస్టు సిరీస్‌తో సంబంధం లేకుండా నేరుగా ఫైనల్‌కు దూసుకెళ్తుంది. ఒకవేళ భారత్, ఆసీస్ మధ్య జరిగే నాలుగో టెస్టు డ్రా అయి.. న్యూజిలాండ్‌పై శ్రీలంక 2–0 తేడాతో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేస్తే టీమ్ఇండియా డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలు గల్లంతవుతాయి. కానీ, కివీస్తో లంకేయులు క్లీన్ స్వీప్ చేయకుండా అంతకంటే తక్కువ తేడాతో విజయం సాధిస్తే భారత్ ఫైనల్కు చేరుకుంటుంది. ఆస్ట్రేలియాతో జరిగే నాలుగో టెస్టులోనూ భారత్ ఓటమిపాలై, న్యూజిలాండ్ సిరీస్ను క్లీన్‌స్వీప్ చేస్తే శ్రీలంక ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ తుదిపోరుకు అర్హత సాధిస్తుంది. ఇదిలా ఉండగా.. అహ్మదాబాద్ వేదికగా మార్చి 9 నుంచి భారత్, ఆసీస్ మధ్య నాలుగో టెస్టు ప్రారంభంకానుంది. మార్చి 9 నుంచే న్యూజిలాండ్, శ్రీలంక రెండు టెస్టుల సిరీస్ జరగనుంది. జూన్ 7–11 మధ్య లండన్లోని ది ఓవెల్ మైదానంలో నిర్వహించనున్నారు. జూన్ 12 తేదీని రిజర్వ్ డేగా ప్రకటించారు.

## డబ్ల్యూపీఎల్‌లో 'ఆర్ఆర్ఆర్' క్షణం.. ఆ ఎనర్జీ మాలోనూ ఉందన్న జెమీమా





న్యూఢిల్లీ: డబ్ల్యూపీఎల్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ విజయంతో ప్రారంభించింది. తొలి మ్యాచ్‌లో 60 పరుగుల తేడాతో ఆర్సీబీపై గెలుపొందింది. కెప్టెన్ లానింగ్, షెఫాలి వర్మ దంచి కొట్టడంతో ఢిల్లీ.. ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యాన్ని ఉంచింది. అయితే ఈ మ్యాచ్‌లో ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ఓపెనర్లు పెవిలియన్ చేరిన అనంతరం క్రీజులోకి వచ్చిన జెమీమా రోడ్రిగ్స్, మారిజానే.. ఓ బంతిని నో బాల్‌గా ప్రకటించాలని అంపైర్ ముందు అప్పీల్ చేశారు. వారు అప్పీల్ చేసిన తీరు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై జెమీమా స్పందిస్తూ.. ఇటీవల రికార్డులను తిరగ రాసిన పాన్‌ఇండియా చిత్రం ఆర్ఆర్ఆర్‌లోని ఓ ఫొటోని షేర్ చేసింది. రామ్ చరణ్, ఎన్టీఆర్‌తో పోల్చుకుంటూ.. అదే ఎనర్జీ మాలోనూ ఉందని సరదా వ్యా ఖ్యను జోడించింది.ఇక ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ 223/2 చేయగా..బెంగళూరు 8 వికెట్ల నష్టానికి 163 పరుగులు మాత్రమే చేయగలిగింది.

## మరోసారి చెబుతున్నా..
## స్ట్రైక్ రేట్‌పై నాది అదే మాట: కేఎల్ రాహుల్



న్యూఢిల్లీ: ప్రస్తుతం టీమ్ఇండియా బోర్డర్ – గావస్కర్ ట్రోఫీలో భాగంగా ఆసీస్‌తో నాలుగు టెస్టుల సిరీస్‌ను ఆడుతోంది. ఇప్పటి వరకు జరిగిన మూడు టెస్టుల తర్వాత భారత్ 2–1 ఆధిక్యంలో కొనసాగుతోంది. చివరి టెస్టు మ్యాచ్ మార్చి 9 నుంచి ప్రారంభం కానుంది. ఆ తర్వాత ఆసీస్తోనే వన్డే సిరీస్లో తలపడనుంది. అనంతరం మార్చి 31 నుంచి ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన లీగ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ మొదలుకానుంది. ఈ క్రమంలో టీ20 ఫార్మాట్లో స్ట్రైక్‌పై సోషల్ మీడియా వేదికగా చర్చ కొనసాగుతోంది. తాజాగా దీనిపై టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ప్రత్యేకంగా స్పందించాడు. స్ట్రైక్‌పై అతిగా అంచనా వేస్తున్నారని వ్యాఖ్యానించాడు. లక్నో కెప్టెన్ అయిన రాహుల్ గత సీజన్లోనూ మెరుగ్గానే రాణించాడు.లక్నో కొత్త జెర్సీ లాంచ్ ఈవెంట్ సందర్భంగా రాహుల్, గౌతమ్ గంభీర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేఎల్ మాట్లాడుతూ.. ''ఫార్మాట్ ఏదైనా సరే స్ట్రైక్‌రేట్ కీలకమే. కానీ, దానిని అతిగా అంచనా వేసి చెప్పడం సరైంది కాదు. ఇదే మాట గతంలోనూ నేను చెప్పా. పరిస్థితిని బట్టి మారిపోతూ ఉంటుంది. మీరు మ్యాచ్‌లో 140 పరుగులనే ఛేదించాల్సి వచ్చిందనుకోండి.. అప్పుడు 200 స్ట్రైక్‌రేట్ అవసరం లేదు. అందుకే, మ్యాచ్‌ను బట్టి బ్యాటింగ్ దూకుడుగా చేయాల్సి ఉంటుంది'' అని తెలిపాడు. గత కొన్నేళ్లుగా భారత్ తరపున గొప్పగా రాణించలేకపోతున్న కేఎల్ రాహుల్‌పై మూడో టెస్టులో వేటు పడింది. అయితే, అతడి స్థానంలో వచ్చిన శుభ్మన్ గిల్ కూడా గొప్పగా ఏమీ రాణించలేదు. దీంతో నాలుగో టెస్టులో రాహుల్‌కు చోటు కల్పించాలనే డిమాండ్లూ వస్తున్నాయి.

## ప్రపంచంలోనే తొలి క్రికెటర్
## హార్దిక్ పాండ్యా సరికొత్త సంచలనం..



న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ జట్టుకి కెప్టెన్‌గా బాధ్య తలు చేపట్టినప్పటి నుంచి మైదానంలో హార్దిక్ పాండ్యా ప్రభంజనాలు సృష్టిస్తూనే ఉన్నాడు. కెప్టెన్‌గానే కాకుండాఆల్రౌండర్‌గాఅద్భుత ప్రద ర్శనలతో దూసుకుపోతున్నాడు. ఈ క్రమంలోనే అతడు కొన్ని అరుదైన ఘనతల్ని తన ఖాతాలో వేసుకున్నాడు. ఇప్పుడు సోషల్ మీడియాలో నూ ఓ సంచలన రికార్డు నమోదు చేశాడు. ఇన్‌స్టాగ్రామ్లో 25 మిలి యన్ ఫాలోవర్లను సంపాదించిన హార్దిక్.. ఈ ఫీట్ సాధించిన అతి పిన్న వయస్కుడైన (29 ఏళ్లు) క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఈ నేపథ్యంలోనే అతడు టెన్నిస్ దిగ్గజాలైన రఫెన్ నాదల్, రోజర్ ఫెదరర్, ప్రముఖ రేసర్ మాక్స్ వెర్ట్‌సాపెన్, ఎర్లింగ్ హాలాండ్‌లను అధిగమించాడు.

## చరిత్ర సృష్టించిన షకీబ్.. తొలి బంగ్లాదేశ్ బౌలర్‌గా రికార్డు



ఢాకా: బంగ్లాదేశ్ దిగ్గజ ఆటగాడు షకీబ్ అల్ హసన్ తాజాగా ఓ అరుదైన రికార్డు సాధించాడు. ఇప్పటికే వైట్ బాల్ క్రికెట్లో వరల్డ్ నంబర్ వన్ ఆల్రౌండర్గా చెలామణీ అవుతున్న షకీబ్.. లేటెస్ట్‌గా వన్డేల్లో 300 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. చట్టోగ్రామ్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన మూడో వన్డేలో రెహాన్ అహ్మద్ వికెట్‌ని పడగొట్టడం ద్వారా.. షకీబ్ ఈ 300 వికెట్ల మార్కుని సాధించాడు. పలితంగా.. ఈ ఘనత సాధించిన తొలి బంగ్లాదేశ్ బౌలర్‌గా షకీబ్ చరిత్రపుటలకెక్కాడు. ఇంతకుముందు బంగ్లాదేశ్ క్రికెట్ చరిత్రలో కేవలం ఇద్దరు ఆటగాళ్లు మాత్రమే 200 వన్డే వికెట్ల మైల్స్టోన్ని అందుకున్నారు. ముష్రఫే మోర్తజా 218 వన్డేల్లో 269 వికెట్లు, అబ్దుర్ రజాక్ 153 వన్డేల్లో 207 వికెట్లు పడగొట్టాడు. ఇప్పుడు షకీబ్ 227 వన్డేల్లో 300 వికెట్లు పడగొట్టి.. ఈ ఫీట్ సాధించిన తొలి బంగ్లా ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ఈ మ్యాచ్లో షకీబ్ అల్ హసన్ బంతితోపాటు బ్యాట్‌తోనూ చెలరేగిపోయాడు. తొలుత బ్యాటింగ్ ఇన్నింగ్స్‌లో 71 బంతుల్లోనే 75 పరుగులు చేసిన షకీబ్.. బౌలింగ్‌లో 10 ఓవర్లలో 35 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. ఇక ఓవరాల్‌గా వన్డేల్లో అత్యధిక వికెట్లు పడగొట్టిన జాబితా ప్రకారం చూసుకుంటే.. షకీబ్ 14వ స్థానంలో ఉన్నాడు. స్పిన్ దిగ్గజం ముత్తయ్య మురళీధరన్ 534 వికెట్లతో ఇప్పటికీ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

## నా మాటలు వెనక్కి తీసుకోను: వెంకటేశ్ మహా



టాలీవుడ్ దర్శకుడు వెంకటేశ్ మహా 'కేజీయఫ్' సినిమాను ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై నెటిజన్లు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో తన వ్యాఖ్యలపై మహా స్పందించారు. తన మాటలను వెనక్కి తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. ''నేను తాజాగా చేసిన వ్యాఖ్యలు చాలా మందికి అభ్యంతరకరంగా అనిపించాయి. నేను ఇప్పటికీ ఆ మాటలను వెనక్కి తీసుకోవడంలేదు. కానీ, నేను మాట్లాడేటప్పుడు ఉపయోగించిన భాష సరైనది కాదని అంగీకరిస్తున్నాను. ఓ దర్శకుడిగా నేను అలాంటి పదజాలాన్ని ఉపయోగించి ఉండకూడదు. అలాంటి పదాలు వాడినందుకు క్షమించండి. నేను ఒక ఇండస్ట్రీని కించపరిచేందుకు అలా మాట్లాడలేదు. మొత్తం సినీపరిశ్రమను ఉద్దేశించి మాట్లాడాను. అన్ని రకాల సినిమాలను ఆదరించాలని చెప్పాలనే ప్రయత్నంలో ఆ వ్యాఖ్యలు చేశాను. ఇప్పటికీ వాటినే సమర్థిస్తున్నాను'' అని స్పష్టం చేశారు. తాను సినిమాలోని కల్పితపాత్రనే దూషించానని.. నిజ జీవితంలోని వ్యక్తిని కాదని మహా తెలిపారు. ''నా సినిమాలు నచ్చిన వారు, నా నిర్ణయం నచ్చిన వాళ్లు నాకు సందేశాలు పంపారు. వాళ్లందరి తరఫున నేను మాట్లాడుతున్నాను. నేను అన్న మాటలను నిజజీవితంలో వ్యక్తికి ఆపాదించి చూస్తున్నారు. అది నా అభిప్రాయాన్ని మీరు విన్న విధానం వల్ల వచ్చిన సమస్య. నేను కల్పిత పాత్రని మాత్రమే దూషించాను. దానికి నన్ను ఎన్నోరకాలుగా విమర్శిస్తున్నారు. నన్ను అసభ్యంగా దూషిస్తున్నారు. ఇలాంటివి చాలా సార్లు చూశాను. ఇలాంటి ఘటనల కారణంగానే నాకు అలాంటి అభిప్రాయం ఏర్పడింది. అన్ని రకాల సినిమాలను ఒకేలా ఆదరిస్తారని ఆశిస్తున్నాను'' అని వెంకటేశ్ మహా అన్నారు.ఇక తన కారణంగా చిత్ర పరిశ్రమలోని ఎంతో గొప్ప దర్శకులు కూడా విమర్శలకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ''నేను పెట్టిన రెండు నిమిషాల వీడియో కారణంగా గత 24 గంటల నుంచి అంతటా చర్చ జరుగుతూనే ఉంది. నా మాటల వల్ల నాతోటి చిత్ర నిర్మాతలు ట్రోల్‌కు గురవుతున్నారు. ఈ విషయంలో బాధగా ఉంది. వాళ్లు తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఎంతో గౌరవనీయులైన దర్శకులు. వాళ్లని విమర్శించకండి'' అని మరో ప్రకటనలో తెలిపారు.

## 'ఈ సంవత్సరం నా భర్తదే'..
### రామ్ చరణ్‌పై ఉపాసన ఆసక్తికర కామెంట్స్



రామ్ చరణ్ సతీమణి ఉపాసన మీడియాలో ఎంత యాక్టివ్‌గా ఉంటారో తెలిసిందే. సామాజిక కార్యక్రమాలతో పాటు సినిమాలకు సంబంధించిన అన్ని ప్రోగ్రామ్స్‌లోనూ చురుగ్గా పాల్గొంటుంది. సినిమా ప్రమోషన్స్ నుంచి ప్రెస్‌మీట్స్ వరకూ ప్రతిచోటా చరణ్‌కు వెన్నంటే ఉంటుంది. 'ఆర్ఆర్ఆర్' టీంతో పాటు ఈ మెగా కోడలు కూడా ఎన్నో సందర్భాల్లో విదేశాల్లో సందడి చేసింది. తాజాగా ఓ ప్రముఖ మీడియాతో మాట్లాడిన ఉపాసన తన భర్త రామ్ చరణ్ సాధిస్తున్న విజయాల గురించి మాట్లాడింది.''నా జీవితంలో జరిగే ప్రతి సంఘటనలో రామ్ చరణ్ నాకు మద్దతుగా నిలిచాడు. అలాగే నేను చెర్రీకి అన్ని విషయాల్లో సపోర్టు ఉంటాను. 'నాటు నాటు' షూటింగ్ కోసం ఉక్రెయిన్ వెళ్లినప్పుడైనా.. ఇంట్లో ఉన్న సమయంలోనైనా.. అలాగే షూటింగ్‌లతో బిజీగా గడుపుతున్నప్పుడైనా.. ఇలా ప్రతి విషయంలోనూ నేను చెర్రీకి వెన్నంటే ఉన్నాను. ఎలాంటి సందర్భంలోనైనా తనకు నేను శాయశక్తుల సాయం చేస్తుంటాను. ఇక చరణ్‌కు ఈ ఏడాది ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. తన వర్క్ పరంగా కూడా ఎంతో సంతృప్తిగా ఉన్నాడు. ఈ సంవత్సరం చరణ్ ఎన్నో ప్రశంసలను అందుకున్నాడు. ఈ ఏడాది తనదే'' అని చెప్పింది. ఇక 'ఆర్ఆర్ఆర్'లోని నాటు నాటు పాటకు గోల్డెన్ గ్లోబ్ అవార్డు వచ్చినప్పుడు కూడా ఉపాసన.. చరణ్‌తో కలిసి సందడి చేశారు. కాలిఫోర్నియాలోని ది బెవర్లీ హిల్టన్ హాల్ వేదికగా జరిగిన ఆ అవార్డుల ప్రదానోత్సవంలో 'ఆర్ఆర్ఆర్' టీంతో పాటు ఉపాసన కూడా పాల్గొంది. ఆ వీడియోలు నెట్టింట సందడి చేశాయి. ప్రస్తుతం రామ్ చరణ్ అమెరికాలో ఉన్నాడు. అక్కడ 'ఆర్ఆర్ఆర్' సినిమా రీ రిలీజ్ అయిన సందర్భంగా ఆడియన్స్‌తో కలిసి ఎంజాయ్ చేస్తున్నారు.

మనం సినిమా

## రాజమౌళి ఎక్స్‌ట్రార్డినరీ డైరెక్టర్ ఏం కాదు..
### స్టార్ హీరో సంచలన వ్యాఖ్యలు



కన్నడ స్టార్ హీరో దర్శన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ హీరో సినిమాల కంటే ఎక్కువగా వివాదాలతోనే ఫేమస్ అయ్యాడు. నోటికి ఏ మాట వస్తే ఆ మాట అనేసి విమర్శల పాలు అవుతూ ఉంటాడు. అమ్మాయిల గురించి, దేవతల గురిం చి, శృంగారం గురించి దర్శన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ వైరల్‌గా మారుతూనే ఉన్నాయి. ఇక తాజాగా దర్శన్.. టాలీవుడ్ డైరెక్టర్ రాజమౌళిపై అనుచిత వ్యాఖ్యలు చేశాడు. బాహుబలి, ఆర్ఆర్ఆర్ వంటి చిత్రాలతో ఇండియన్ సినిమాను ఆస్కార్ వరకు తీసుకెళ్లిన డైరెక్టర్ రాజమౌళి. ఆయన ఇండస్ట్రీకి దొరకడం ఎంతో అదృష్టమని ప్రతి ఇండస్ట్రీ గొప్పగా చెప్పుకొస్తుంది. ఈ నేపథ్యంలో దర్శన్, రాజమౌళి గురించి మాట్లాడిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి.టాలీవుడ్ దర్శకుడు రాజమౌళి పేరెత్తగానే అందరూ ఆహా ఓహో అంటుంటారు.. ఆయనేమీ ఎక్స్ట్రార్డినరీ డైరెక్టర్ కాదు.. రాజమౌళి కేవలం ఒక దర్శకుడు మాత్రమే.. దానికెందుకు అంతగా అతడిని హైప్ చేస్తున్నారు అని కామెంట్స్ చేశాడు. ఇక దీంతో నెటిజన్స్.. దర్శన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మన సినిమాను విదేశాలకు తీసుకెళ్లి మన ఇండియన్ ఖ్యాతిని నిలబెట్టిన దర్శకుడిని ఇలాంటి మాటలు అనడం.. మీకు పద్ధతి కాదని చెప్పుకొస్తున్నారు. ఇంకో పక్క డైరెక్టర్ వెంకటేష్ మహా.. ప్రశాంత్ నీల్‌ను అన్నందుకు.. రివేంజ్‌గా దర్శన్, రాజమౌళిని అంటున్నాడని మరికొందరు అంటున్నారు.

## శ్రీకాకుళం నేపథ్యంలో 'కన్యాకుమారి'!



ఆనంద్ దేవరకొండ 'పుష్పక విమానం' మూవీతో దర్శకుడిగా పరిచయం అయ్యాడు దామోదర. మొదటి సినిమాతోనే చక్కని గుర్తింపు తెచ్చుకున్న దామోదర ఇప్పుడు రెండో సినిమాకు శ్రీకారం చుట్టాడు.'పుష్పక విమానం' వంటి మినిమం బడ్జెట్ మూవీతోనే మాగ్జిమం ఎంటర్‌టైన్ చేసిన దామోదర ఇప్పుడు విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కిస్తున్నాడు. దామోదర స్వీయదర్శకత్వంలో ర్యాడికల్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి 'కన్యాకుమారి' అనే టైటిల్‌ను ఫిక్స్ చేసి ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేశారు. ఈ పోస్టర్ చాలామందికి నోస్టాల్జిక్ ఫీలింగ్స్‌ను ఇస్తోంది. 'పుష్పక విమానం'లో ఓ హీరోయిన్‌గా నటించిన గీతా శైనీ, శ్రీచరణ్ రాచకొండ జంటగా నటిస్తోన్న చిత్రం ఇది. మొదటి చిత్రాన్ని తెలంగాణ బ్యాక్ డ్రాప్‌లో చూపించిన దామోదర, రెండో దానిని శ్రీకాకుళం నేపథ్యంలో గ్రామీణ ప్రేమకథా చిత్రంగా తెరకెక్కిస్తున్నాడు. ప్రస్తుతం చివరి షెడ్యూల్ చిత్రీకరణ జరుపుకుంటోన్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి ఎడిటర్: నరేష్ అడుపా, సంగీతం: సాహిత్య సాగర్, సినిమాటోగ్రఫీ: శివ గాజుల, సహ నిర్మాతలు : సతీష్ రెడ్డి, వరీనియా మామిడి, సిద్ధార్థ్ ఏ.

# 'గీత సాక్షిగా' రెండు భాషల్లో




నిజ ఘటనల ఆధారంగా రూపొందిన ఇన్‌టెన్స్ ఎమోషనల్ డ్రామా 'గీత సాక్షిగా'. ఆదర్శ్, చిత్రా శుక్లా జంటగా నటించిన ఈ చిత్రానికి నిర్మాత చేతన్ రాజ్ కథను కూడా సమకూర్చడం విశేషం.దీనికి ఆంథోని మట్టిపల్లి స్క్రీన్ ప్లే రాసి, దర్శకత్వం వహించారు. హోలీ సందర్భంగా మంగళవారం మేకర్స్ ప్రేక్షకులందరికీ శుభాకాంక్షలను తెలియజేస్తూ ఈ సినిమాను మార్చి 22న తెలుగు, హిందీ భాషల్లో విడుదల చేయబోతున్నట్లు ప్రకటిస్తూ పోస్టర్ను రిలీజ్ చేశారు.

పోస్టర్‌లో 'గీత సాక్షిగా జడ్జిమెంట్ డే మార్చి 22న' అని తెలియజేశారు. కంటెంట్ ప్రధానంగా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో చరిష్మా కీ రోల్ పోషించింది. ఆమె చుట్టూనే సినిమా కథాంశం తిరుగుతుంటుందని మేకర్స్ తెలియజేశారు. ఇందులో ఇతర ప్రధాన పాత్రలను శ్రీకాంత్ అయ్యంగార్, రూపేష్ శెట్టి, భరణి శంకర్, జయలలిత, అనితా చౌదరి, రాజా రవీంద్ర తదితరులు పోషించారు. వెంకట్ హనుమ నారిశెట్టి సినిమాటోగ్రఫీ అందించిన ఈ చిత్రానికి కిషోర్ మద్దాలి ఎడిటర్. సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ గోపీ సుందర్ సమకూర్చారు.

## 20 నిముషాలు టైం ఇస్తే ఎన్టీఆర్
# చైనీస్ భాష కూడా మాట్లాడగలడు



మార్చి 10న నెట్ ఫ్లిక్స్‌లో ప్రీమియర్ కానుంది 'రానా నాయుడు'. దగ్గుబాటి అభిమానులు ఎప్పటినుంచో వెయిట్ చేస్తున్న ఈ వెబ్ సీరీస్‌లో వెంకటేష్, రానా కలిసి నటించారు.రానా నాయుడు ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న రానా ఒక ఇంటర్వ్యూలో మన హీరోల గురించి మాట్లాడాడు. చరణ్, ఎన్టీఆర్, అల్లు అర్జున్, ప్రభాస్‌ల నుంచి ఏదైనా దొంగతనం చెయ్యాలి అంటే ఏం తీసుకుంటారు అని యాంకర్ అడిగిన ప్రశ్నకి రానా చరణ్‌కి ఏదైనా ఇచ్చేస్తాను, తీసుకోను. ప్రభాస్ దగ్గర చాలా మంచి ఫుడ్ దొరుకుతుంది కాబట్టి అతని చెఫ్‌ని దొంగతనం చేస్తాను. అల్లు అర్జున్ నుంచి అయితే దొంగతనం చెయ్యను మేమిద్దరం కలిసి ఇంకొకరి దగ్గర నుంచి దొంగతనం చేస్తాం. ఇక ఎన్టీఆర్ నుంచి ఏదైనా దొంగతనం చెయ్యాలి అంటే అతని లింగ్విస్టిక్ స్కిల్స్‌ని దొంగతనం చేస్తాను. తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళంతో పాటు ఇంకో అయిదు ఇండియన్ భాషలని ఎన్టీఆర్ మాట్లాడుతాడు. ఒక 20 నిముషాలు టైం ఇస్తే, కాసేపు వింటే చాలు ఎన్టీఆర్ ఏ భాష అయినా అనర్గళంగా మాట్లాడుతాడు. చైనీస్ భాషని కూడా కాస్త టైం ఇస్తే ఎన్టీఆర్ మాట్లాడేస్తాడు అని చెప్పాడు. రానా మాటలని ఎన్టీఆర్ ఫాన్స్ సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఇది రా మా అన్న గొప్పదనం అంటూ నందమూరి అభిమానులు ట్విట్టర్‌లో హల్‌చల్ చేస్తున్నారు.ఆర్ ఆర్ ఆర్ ప్రమోషన్స్ సమయంలో కూడా జపనీస్, ఫారిన్ ఇంగ్లీష్, కన్నడ, హిందీ, తమిళ్ భాషలని ఎన్టీఆర్ అనర్గళంగా మాట్లాడిన వీడియోస్ బాగానే వైరల్ అయ్యాయి. ఇదిలా ఉంటే ఆర్ఆర్ఆర్ సినిమా ఇన్ని ఇంటర్నేషనల్ అవార్డుల ను గెలుస్తుందని తాను ముందే నమ్మానని, రాజమౌళి తన క్రాఫ్ట్‌ని పెంచుకుంటూ వెళ్తున్నాడు. మార్చి 12న నాటు నాటు సాంగ్ ని ఆర్ఆర్ఆర్ సినిమా ఆస్కార్‌ని తెస్తుంది అని చెప్పాడు. రానా మాటలు నిజమైతే, ఆ గోల్డెన్ మూమెంట్‌ని మన హిస్టరీలో ఎప్పటికీ గుర్తుండేలా సెలబ్రేట్ చేసుకోవాల్సిందే.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sri Vari Printers, D.No: 13-7-954/C1, Korlagunta, Tirupathi-517501, Chittor District (AP), And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet, Guntur (District), AP-522002. CHIEF EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939. Phone No.040-27819999. E-mail Id: editor@manamnews.com.